Postal License No. VSP / 96/ 2021 - 23
VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
visit: www.visakhasamacharam.com




# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 22 విశాఖపట్నం, 26 అక్టోబరు 2023 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## స్వరూపానందేంద్రను కలిసిన రామ్ విలాస్ వేదాంతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యులు, మాజీ ఎంపీ రామ్ విలాస్ వేదాంతి బుధవారం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల ఆలయంలో పూజలు చేసారు. దేవతామూర్తుల ఆలయాలను దర్శించారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసారు. ఇటీవల కురుక్షేత్రలో విశాఖ శారదాపీఠం నిర్వహించిన శత సహస్ర చండీ పారాయణ గురించి తెలిసి పీఠాధిపతులను అభినందించారు. దక్షిణాది హైందవ సంప్రదాయాలను ఉత్తరాదికి వ్యాప్తి చేయాలని కోరారు. అయోధ్యలో రామ జన్మభూమి ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కారిడార్ గా అయోధ్య వృద్ధి చెందుతోందని తెలిపారు. విశాఖ శారదాపీఠం ఆశ్రమాన్ని అయోధ్యలో ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో పార్లమెంటు సభ్యునిగా పని చేసారు. అలాగే వశిష్ట పీఠాధీశ్వరులుగా ఉత్తర భారతదేశంలో గుర్తింపు పొందారు

## యంత్ర పూజలో తుపాకులు, తదితర ఆయుధాలు



**బొబ్బిలి, (విశాఖ సమాచారమ్):** బొబ్బిలి కోటలో ఆయుధ పూజ సందర్భంగా ఘనంగా దసరా వేడుకలు జరిగాయి. వారసులు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన కత్తులు, బళ్లేలు, ఇతర ఆయుధాలకు మహల్‌లో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, ఆయన సోదరుడు బేబినాయన పూజలు చేశారు. రాజదర్పం ఉట్టిపడేలా బంగారు, వెండి సింహాసనాలను కూడా ఉంచారు. బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల నుంచి అభిమానులు, వారి అనుయాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌తోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మా సవాల్‌కు ప్రభుత్వం స్పందించలేదు

(ప్రత్యేకప్రతినిధి)

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** ఏపీలోని డిస్టలరీస్ యజమానుల వివరాలు ఇవ్వగలరా? అని మేము సవాల్ విసిరామని.. కానీ ప్రభుత్వం స్పందించ లేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ బెవరెజెస్ కార్పోరేషన్ వద్ద 100కు డిస్టలరీ కంపెనీల నమోదయ్యాయని, కానీ 74 శాతం మద్యం సరఫరాను కేవలం 16 కంపెనీలే చేస్తున్నాయన్నారు. అదాన్ డిస్టలరీస్ 2019లో మొదలైందని, రూ. 1164 కోట్ల మేర మద్యం సరఫరా ఆర్డర్ అదాన్ కంపెనీకే ఉన్నాయన్నారు. అదాన్ కంపెనీ వెనుక ఎంపీ విజయసాయి రెడ్డి ఉన్నారని, ఈ రెండు కంపెనీలను అదాన్ బలవంతంగా చేజిక్కించుకుందని ఆమె ఆరోపించారు. చింతకాయల రాజేష్, పుట్టా మహేష్ వంటి వారికి చెందిన సంస్థలను బలవంతంగా అదాన్ కంపెనీ చేజిక్కించుకుందన్నారు.



ఎస్పీవై అగ్రస్ సంస్థకు రూ. 1800 కోట్ల మేర సరఫరా ఆర్డర్స్ ఉన్నాయని, ఈ సంస్థ వెనుక మిధున్ రెడ్డి ఉన్నారని పురంధరేశ్వరి ఆరోపించారు. ప్రకాశం జిల్లాలో పెర్ల్ డిస్టలరీస్ దీన్ని సీఎం జగన్ సన్నిహితులు బలవంతం పెట్టి సబ్ లీజుకు తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసే కంపెనీల జాబితా.. ఆ

(మిగతా 2లో)

## ఈనెల 29న చంద్రగ్రహణం : ప్రముఖ ఆలయాలు మూసివేత



**తిరుపతి :** ఈ నెల 29వ తేదీన చంద్రగ్రహణం కారణంగా ... తిరుమల తిరుపతి దేవస్థానాన్ని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని, రాజన్న ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న అన్ని ఆలయాలను మూసేస్తున్నట్లు సదరు ఆలయ అధికారులు ప్రకటించారు. సూర్యగ్రహణం పూర్తయిన 14 రోజుల తర్వాత చంద్రగ్రహణం ఏర్పడనుంది. ఒకే నెలలో రెండు గ్రహణాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దేవాలయాలను మూసేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటన చేశారు.

టిటిడి అధికారులు మాట్లాడుతూ ... 29వ తేదీ తెల్లవారుజామున 1.05 గంటల నుంచి 2.22 గంటల వరకు చంద్రగ్రహణం ఉండటంతో 28వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 29వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నామని తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా 28న సహస్ర దీపాలంకరణ సేవ, వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక దర్శనాలను టిటిడి రద్దు చేసింది. తిరుమలకు భక్తుల రద్దీ ఎక్కువైన కారణంగా ... నవంబర్ 1, 7, 8, 14, 15 తేదీల్లో సర్వదర్శనం టోకెన్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులు మాట్లాడుతూ ... ఈ నెల (28-10-2023) శనివారం మధ్యాహ్నం 1.16 నుంచి 1.51 గంటల వరకు రాహు గ్రస్త చంద్రగ్రహణం ఏర్పడనున్న నేపథ్యంలో రాజన్న ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాలను కూడా మూసివేస్తున్నట్లు వెల్లడించారు.

(మిగతా 2లో)



(మొదటి పేజీ తరువాయిలు)

## ఈనెల 29న చంద్రగ్రహణం : ప్రముఖ ఆలయాలు మూసివేత

శనివారం సాయంత్రం 4:15 గంటల నుండి ఆదివారం గ్రహణం తర్వాత (29-10-2023) ఆలయాలకు తిరిగి, గ్రహణం అనంతరం 3:40 నిమిషాలకు సుప్రభాత పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కోసం సేవలు ప్రారంభిమని తెలిపారు.

### మా సవాల్‌కు ప్రభుత్వం స్పందించలేదు

కంపెనీల ఓనర్ల జాబితా ఇవ్వాలంటే ఇవ్వలేదని, ఇప్పుడు మేమే ఆ వివరాలు బయట పెట్టామన్నారు. దశలవారీ మద్య నిషేధం చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని, మద్యం తయారీదారులు, అమ్మకం దారులను ఏడేళ్ల పాటు జైలుకు పంపుతామన్నారని.. ఇప్పుడు మద్యం తయారీదారుల జాబితా విడుదల చేశామని.. వారిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారని పురంధరేశ్వరి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లెక్కల్లోకి రాని మద్యం డబ్బుల వివరాలేవి?.. మద్య నిషేధం అమలు చేయబోమని చెప్పి మరీ మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారన్నారు. ఫోన్ పే.. గూగుల్ పే వంటివి మద్యం దుకాణాల్లో ఎందుకు కన్పించవని పురంధరేశ్వరి నిలదీశారు.

ఎపీలో అప్పుల భారాలపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ప్రభుత్వం చేస్తున్న అప్పులపై ఫిర్యాదు చేశామని దగ్గుబాటి పురంధరేశ్వరి చెప్పారు. పార్లమెంట్‌లో చేసిన ప్రకటన ఆధారంగా ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని వివరించామన్నారు. కార్పోరేషన్లు, రాష్ట్ర ఆస్తులను తనఖా పెట్టి అప్పులు తెచ్చారని, ఫొరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. సీరియల్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్, ఐటీ, ఈడీ ద్వారా మద్యం కుంభకోణాలపై విచారణ చేపట్టాలని కేంద్రమంత్రికి వినతి పత్రం ఇచ్చామని దగ్గుబాటి పురంధరేశ్వరి పేర్కొన్నారు.

## చంద్రబాబుని 50 రోజులు జైల్లో పెట్టి ఏం సాధించారు?



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గాజాపై ఇజ్రాయిల్ దాడి చేస్తుంటే.. ఇజ్రాయిల్ని సపోర్ట్ చేయడం బీజేపీ తప్పు అని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. విదేశాంగ విధానం పూర్తిగా తప్పు అని పేర్కొన్నారు. దేశంలో నిత్యావసర ధరలు భారీగా పెరిగాయన్నారు. జీఎస్టీ ద్వారా ఆదాయాన్ని దోచుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అరుంధతి నక్షత్రంలా ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతుల్లో వెళ్తుందని చింతా మోహన్ అన్నారు. విద్యా వ్యవస్థని భ్రష్టు పట్టించి రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేస్తోందన్నారు.

చంద్రబాబును అరెస్ట్ చేయడం తప్ప.. ఆధారాలు ఎక్కడున్నాయి ఇప్పటికైనా చెప్పాలని చింతా మోహన్ ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు రాష్ట్ర ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. జైలు మాన్యువల్‌లోనే ఫోన్ సౌకర్యం కూడా కల్పించాలని ఉందన్నారు. చంద్రబాబుని 50 రోజులు జైల్లో పెట్టి ఏం సాధించారని చింతా మోహన్ పేర్కొన్నారు.చంద్రబాబు నెత్తిన పాలు పోశారన్నారు. ఐపీఎస్ అధికారులు ఇండియన్ పొలిటికల్ సర్వీసులో ప్రారంభించినట్టుందన్నారు. కోర్టుల పైన కూడా ప్రజలకు నమ్మక పోతుందన్నారు. కోర్టులో బీజేపీ ప్రమేయం ఉందన్నారు. జడ్జిమెంట్ ఢిల్లీలో తయారవుతున్నాయన్నారు. ప్రజలకు కోర్టులపై నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర రాజకీయాలు భ్రష్టుపట్టాయన్నారు. రాష్ట్రంలో ఈ రోజు మార్పు వచ్చిందని.. చాలామంది ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని చింతా మోహన్ అన్నారు.

## ఏలూరు ఏజెన్సీలో అరకు అందాలు



**ఏలూరు:** అక్కడి ప్రకృతి అందాలు పర్యాటకలను కట్టిపడేస్తాయి. ఎటు చూసినా ఆహ్లాదకర ప్రదేశం, ఎత్తయిన కొండలు, మధ్యలో గోదావరి గలగలలు.. మరోపక్క ప్రశాంత వాతావరణం.. అయితే అలాంటి ఆహ్లాదకర వాతావరణం ఎక్కడుందో తెలుసుకోవాలని ఉందా..? అక్కడి ప్రత్యేకతలు ఏమిటి? ఇప్పుడు తెలుసుకుందాం.. ఏలూరు జిల్లా విలీన మండలం వెలేరుపాడు మండలం గోదావరి నది పరివాహక ప్రాంతం.. విలేరుపాడు నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో కట్కూరు అనే గ్రామం ఉంది. అయితే అక్కడ సుందర వాతావరణం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. సంవత్సరం పొడుగునా కాలాలతో సంబంధం లేకుండా పచ్చదనం ఆ ప్రదేశంలో పరిమళిస్తుంది. అయితే ఒక్క గోదావరి ఉధృతి సమయంలో తప్ప మిగతా రోజులలో అక్కడికి సులభంగా వెళ్లవచ్చు.

చుట్టూ ఎత్తైన కొండలు, మధ్యలో గోదావరి ప్రవాహం, నది ఒడ్డున కట్కూరు గ్రామం ఉంది. అలాగే మరొకవైపు కొండపై ఎంతో ప్రాముఖ్యత కలిగిన పురాతన శివాలయం అక్కడ మనకు దర్శనమిస్తుంది. చాలామంది పర్యాటక ప్రేమికులు ఆ ప్రదేశంలో ఎంతో ఆనందాన్ని పొందుతారు. వేలూరుపాడు నుంచి కట్కూరికి రోడ్డు మార్గం ద్వారా వెళుతుండగా కొండల నుంచి వచ్చే చల్లని గాలి, ఎత్తు పల్లాలతో చిన్నచిన్న గాటిల మాదిరిగా ఉన్న రహదారి, రహదారికి ఇరువైపులా పచ్చనీ పంటలతో సుందరంగా ఉండి మరో అరకుల ఆ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తుంది. అలాగే మహాశివరాత్రి నాడు కొండపై శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ముందుగా గోదావరి నదిలో పుణ్య స్థానాలు ఆచరించి శివాలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తారు. శివాలయం ప్రాంతం నుంచి గోదావరి నదికి మరోవైపున ఉన్న కొండలు ఎంతో రమణీయంగా ప్రకృతి పరవశింప చేసేలా కనిపిస్తాయి.

అదేవిధంగా శీతాకాలంలో మంచు కొండలను తాకుతూ గోదావరి నదిపై నుంచి ప్రయాణం చేస్తున్నట్లుగా ఓ మంచు దుప్పటిలాగా ఆ ప్రాంతాన్ని ఆవరించి కాశ్మీర్ అందాలను తలదన్నేలా పర్యాటకులను రంజింప చేస్తాయి. ఆంధ్ర తెలంగాణ నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు అక్కడికి వచ్చి ఆ అందాలను తిలకిస్తారు. అయితే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే అందాలు కనుమరుగే ప్రమాదం ఉంది. దాంతో చాలామంది ఇటీవల ఆ ప్రాంతానికి కుటుంబాలతో విహారయాత్రకు వెళుతున్నారు. కార్తీక మాసంలో అయితే ప్రతిరోజు ఆ ప్రాంతం పర్యాటకులతో కళకళలాడుతుంది. అయితే పర్యాటకు కావలసిన పూర్తిస్థాయి సౌకర్యాలు మెరుగుపరిచి, అక్కడ బస చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని పలువురు పర్యాటకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రజల ఆరోగ్యం కోసమే జగనన్న సురక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు అని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గేదెల నాగరాజు పేర్కొన్నారు. జోన్ 3 పరిధి 17 వార్డు ఎం వి పీ కాలనీ సెక్టార్ 1 లో గల నేతాజీ పార్కు లో బుధ వారం ఏర్పాటు చేసిన సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాలకు అధిక బడ్జెట్ కేటాయిస్తుందని తెలిపారు. పలు ప్రాంతాల్లో కొత్త వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మాణంలో వున్నాయి అని గుర్తు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక మొత్తంలో డబ్బు వసూలు చేసి నిర్వహించే వైద్య పరీక్షలు ఈ శిబిరాల్లో ఉచితంగా చేస్తున్నారు అని వివరించారు. శిబిరంలలో గుర్తించిన వారికి ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు కూడా చేస్తారు అన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరంలో సుగర్, బీపీ పరీక్షలు చేశారు. అలాగే, దంత, చర్మ, నేత్ర వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం కావాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జగనన్నకు చెబుదాం వేదికగా ప్రజల నుంచి వస్తున్న వినతులపై సకాలంలో సరైన విధంగా స్పందించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపటమే అంతిమ లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె. యస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం ములగాడ మండల స్థాయి కార్యక్రమం స్థానిక మరిడిమాంబకళ్యాణమండపంలో బుధవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి రీ-సర్వే, భూ సరిహద్దులు, విస్తీర్ణం విభేదాలు, ఆక్రమణలు, జీవీఎంసీ పరిధిలోని మౌలిక వసతుల కల్పన, మురుగు కాలువల తవ్వకం, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, వీధి లైట్ల ఏర్పాటు తదితర సమస్యలపై 60 మంది అర్జీదారులు వినతులు సమర్పించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఒకటికి రెండు సార్లు పరిశీలించి అధ్యయనం చేయాలని, శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని చెప్పారు. రెండు, మూడు శాఖలకు చెందిన సమస్య ఉంటే సమన్వయం చేసుకోవాలని, అవసరమైతే సమస్యను పరిష్కరించేందుకు సంయుక్త క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. సానుకూల ధోరణితో వ్యవహరించి ప్రజలు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):** రాంబిల్లి మండలం హరిపురం గ్రామంలో అభయాంజనేయ స్వామి వారి వార్షికోత్సవాన్ని బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద తెల్లవారుజామున నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోగా మేళ తాళాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారిని దర్శించుకున్న వారిలో జెడ్పిటిసి దూళి నాగరాజు,గ్రామ సర్పంచ్ దూళి దేముడమ్మ అప్పారావు, మాజీ సర్పంచ్ దూళి సూర్య చంద్రరావు, యలమంచిలి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేఖా నందగోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ శివకోటి ఈశ్వరరావు తదితరులు స్వామి వారిని దర్శించుకుని, ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా స్వామి వారి ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చందక అప్పలనాయుడు, సీరా అప్పలకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారిని ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు-ప్రసాద్



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** నిద్ర పోయే వారిని లేపొచ్చు గానీ నటించే వారిని లేపడం కష్టమని వైసీపీ నేతలు జోగి రమేష్, అంబటి రాంబాబు లాంటి వారిని చూస్తే నిజమనిపిస్తుందని బుధవారం నాడు యలమంచిలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కసిరెడ్డి ప్రసాద్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అన్నా క్యాంటీన్లతో పేదలు కడుపు నింపారని, పెళ్లి కానుకలతో ఆడ బిడ్డకు అండగా నిలిచారని, పేదలకు ఇల్లు కట్టించారని, బెస్ట్ అవైల్ బుల్ స్కూల్స్, స్టడీ సర్కిల్స్ ,స్కిల్ డెవలప్మెంట్ , విదేశీ విద్య తో చదువుకు తోడుగా నిలిచారని,అదే విదంగా పెన్షన్ లు ను 1800 రూపాయిలు పెంచితే జగన్ రెడ్డి పెంచింది ఎంత అని ప్రశ్నించారు.తమ పార్టీ అధ్యక్షులు పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టించారన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు అనేక పరిశ్రమలను రప్పించి యువతకు ఉద్యోగాలు ఇస్తే అటువంటి కంపెనీలను ప్రస్తుత ప్రభుత్వం తరిమికొట్టడంతో పాటుగా ఉద్యోగ నోటికేషన్లు దూరం చేశారని విమర్శించారు.ప్రతీ పండుగకు రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు పండగులుకు కానుకులిస్తే ఈ నాలుగున్నరేళ్లలో ఏ పండుగకైనా ప్రస్తుత ప్రభుత్వం ఒక్క కానుకైనా ఇచ్చిందా అన్నారు. ఇలా పేదలను ఆదుకునేందుకు చంద్రబాబు చేపట్టిన పథకాలన్నీ రద్దు చేశారు.ప్రజా చైతన్య వేదికలాంటి కట్టాడాలని కూల్చేసి,పేదల్ని సెంటు స్థలంలో కుక్కి తాను మాత్రం బారీ ప్యాలస్ కట్టుకున్న ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని మించిన పెత్తందారు ఎవరుంటారని విమర్శించారు. కానీ ప్రస్తుతం చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేస్తే రాష్ట్రంలో యువత అంతా రోడ్డు ఎక్కిందన్నారు. హైదరాబాద్, బెంగుళూర్, చెన్నై, పూణే లాంటి నగరాల్లో. ఐటీ ఉద్యోగులు చంద్రబాబుకు మద్దతు తెలిపారు.70దేశాల్లో చంద్రబాబుకు మద్దతుగా నిలిచారు. ఇంత జరిగినా ఎవరూ మద్దతు తెలపలేదంటూ మాట్లాడే వారిని చూస్తే జాలి కలుగుతుందన్నారు.చంద్రబాబు నాయుడు ఎప్పటికైనా కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు.

## భక్తులకు బంపర్ ఆఫర్

### రూ.38 లక్షల విరాళంతో ఒకరోజు అన్నప్రసాద వితరణకు అవకాశం



తిరుమల కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు రుచిగా, శుచిగా ఒక రోజు అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒకరోజు విరాళ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ కోసం రూ.38 లక్షలు విరాళం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విరాళం మొత్తం ఇప్పటివరకు రూ.33 లక్షలు ఉండగా, పెరిగిన ధరల నేపథ్యంలో టీటీడీ రూ.38 లక్షలకు పెంచింది. ఉదయం అల్పాహారం కోసం రూ. 8 లక్షలు, మధ్యాహ్న భోజనం కోసం రూ.15 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.15 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు. విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రదర్శిస్తారు. అదేవిధంగా దాతలు తమ కోరిక మేరకు ఒకరోజు ఇక్కడ అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని పొందొచ్చు.

## పంచాంగం

గురువారం 26-10-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం శరదృతువు
ఆశ్వయుజ మాసం

తిథి : శు. ఏకాదశి ఉ. 10.26
నక్షత్రం : శతభిషం ప. 12.50
వర్జ్యం : ప. 12.50 ల 06.23

## ఆరోగ్య సురక్షతో రోగి వద్దకే వైద్యం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్య ప్రదాతగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నిలుస్తారని ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు అన్నారు. మున్సిపాలిటీలో కొత్తపాలెం సచివాలయ పరిధిలో తులసీ కళ్యాణ మండపంలో జగనన్న వైద్య సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. యలమంచిలి పీహెచ్సీలకు చెందిన వైద్యులు, కంటి వెలుగు వైద్యులు జయ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు క్రమం తప్పకుండా చెకప్‌లు చేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీలో కవర్ కాకుం డా గతంలో చికిత్సలు చేయించుకున్న పాత రోగుల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా నాణ్యమైన మందులు, పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అన్ని రకాల వైద్యపరీక్షలు కూడా చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కార్పోరేట్ వైద్యం అందుతోందని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న పాత రోగులు విషయంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చికిత్స అనంతరం వీరు వాడాల్సిన మందులు ఎంత ఖరీదైనా సరే వారికి అందించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అనంతరం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహిం చారు. మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, మాజీ డిసిసిబి చైర్మన్ యువి సుకుమార్ వర్మ,మున్సిపల్ కమిషనర్ కె. కొండలరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపిడిఓ అప్పల నాయుడు, వైసీపీ పట్టణ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్ అరేపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ కర్రి శివ,వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

గురువారం 26-10-2023

# నిష్పాక్షిక జర్నలిజం అవసరం : ఎంవివి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జర్నలిజంలో నిష్పాక్షికత ఉన్నప్పుడే ప్రజలకు ప్రభుత్వానికి ఆ మీడియా వారధిగా పని చేయగలదని విశాఖ పార్లమెంటు సభ్యులు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వి.వి సత్యనారాయణ అన్నారు.

18వ వార్డు పరిధిలో సెక్టర్ - 3లో "V1" సాటిలైట్ న్యూస్ ఛానల్ ను ఎం వి వి సత్యనారాయణ గారు, 18వ వార్డు ఇంచార్జ్ పుక్కళ్ళ ధనలక్ష్మి శంకర్ సంయుక్తంగా గురువారం ప్రారంభించారు. ఎంవివి సత్యనారాయణ V11 యాజమాన్యానికి శుభాభినందనలు తెలిపారు. మీడియా భారీ ఎత్తున అభివృద్ధి సాధించి సత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుండాలని ఆశించారు. మీడియా విస్తృతంగా సేవలందించినప్పుడే ప్రజలకు సరైన సమాచారం చేరే అవకాశం ఉంటుందన్నారు. విశాఖ కేంద్రంగా మీడియా భారీ ఎత్తున ఎదగాల్సిన అవసరం ఉందన్నారు.



**వార్డు మహిళా నాయకురాలు జ్యోతికి పరామర్శ**

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ 18వ వార్డు మహిళా నాయకురాలు జ్యోతి గారిని సత్యనారాయణ గారు, పుక్కళ్ళ ధనలక్ష్మి శంకర్ పరామర్శించారు. జరిగిన ప్రమాదం గురించి ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చంద్ర, వైఎస్ఆర్సిపి విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల గణేష్, 19వ వార్డు ఇంచార్జ్ సూరాడదాసు, సచివాలయం కన్వీనర్స్ అప్పాజీరావు, వీరబాబు, సతీష్, సంపంగి సురేష్, ఈశ్వరరావు, జగదీష్, సీనియర్ నాయకులు గోపి, వాసుపల్లి వెంకటపతి రాజు, చంటి, దుర్గారావు, చొక్కా శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెట్టించిన ఉత్సాహంతో చంద్రబాబు మళ్లీ సీఎం అవుతారు: మురళీ మోహన్

హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆయనకు మద్దతుగా తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు తాజాగా 'చంద్రబాబు గారితో మనం' అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మురళీ మోహన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నిర్మాతలు, దర్శకులు పాల్గొన్నారు. సరైన ఆధారాలు చూపకుండా చంద్రబాబును అరెస్ట్ చేయడం తగదని.. కాబట్టి ఆయన్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మురళీ మోహన్ మాట్లాడుతూ.. "అందరి గుండెల్లోనూ బాధ ఉంది. గుండెలు మండిపోతున్నాయి. కానీ ఎలా బయటకు రావాలి? తమ ఆవేదనను ఎలా బహిర్గతం చేయాలనే దానిపైనే అందరి ఆలోచన. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించే వారే నిజమైన నాయకులు. ఒక నాయకుడు అనే పదానికి సరైన అర్థం చంద్రబాబు. అలాంటి ఆయన్ని 74 ఏళ్ల వయసులో అరెస్టు చేసి జైల్లో పెట్టినందుకు ప్రతి ఒక్కరూ రగిలిపోతున్నారు. ఏ రోజునా కూడా బయటకు రాని మహిళా సోదరీమణులందరూ ఇప్పుడు బయటకు వచ్చి తమ నిరసన గళాన్ని తెలియజేస్తున్నారు. అడవిలో ఉండే పులులు, సింహాలను చూస్తుంటాం. అవి వేటకు వెళ్లినప్పుడు నాలుగు అడుగులు వెనక్కి వేసి.. రెట్టించిన ఉత్సాహంతో ముందుకు దూకుతాయి. ఇప్పుడు చంద్రబాబు చేయబోయేది అదే. హైదరాబాద్ ఇంతగా అభివృద్ధి చెందడానికి ముఖ్య కారణం ఆయనే. అభివృద్ధి గురించి ఆలోచించే వ్యక్తికి ఇలాంటి పరిస్థితి రావడం శోచనీయం. చంద్రబాబునాయుడికి ఇది



గ్రహణంలాంటిది. గ్రహణం విడిచిన తర్వాత ఆయన కూడా దేదీప్యమానమైన వెలుగులతో కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. అమరావతిని అద్భుతమైన నగరంగా నిర్మించడం కోసం రైతుల నుంచి 35 వేల ఎకరాలను సేకరించారు. అసెంబ్లీ కట్టారు. సెక్రటేరియట్ కట్టారు. హైకోర్టు కట్టారు. నాయకులు మారిన తర్వాత మూడు రాజధానుల స్కీమ్ తీసుకువచ్చారు. దేశానికి ఒక్క రాజధాని ఉంటే ఏపీకి మూడు రాజధానులు కావాలా? నీతి, నిజాయతీగా ఉన్నవాళ్లకు భగవంతుడు ఎప్పుడూ అండగా ఉంటాడు. రెట్టించిన ఉత్సాహంతో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు" అని అన్నారు.

"చంద్రబాబుతో మాకు సత్సంబంధాలున్నాయి. చంద్రబాబుకు జరిగింది అన్యాయం. ఏదేమైనా న్యాయమే గెలుస్తుందని నమ్ముతున్నాం. ఆయన తక్షణమే విడుదల కావాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నా" చిత్రపురి హిల్స్, ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ అన్నారు.

"రామారావు గారి కుటుంబంతో మా కుటుంబానికి వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉంది. కర్షక పరిషత్ ఛైర్మన్‌గా ఉన్నప్పటి నుంచి చంద్రబాబుతో నాకు పరిచయం ఉంది. రాజకీయ నాయుకుడు, ముఖ్యమంత్రిగా ఆయన ఎలాంటి సేవా కార్యక్రమాలు చేశారనేది ప్రజలందరికీ తెలుసు. భవిష్యత్తు తరాల కోసం ఆయన ఎప్పుడూ ఆలోచించేవారు. 1995-1997 మధ్యకాలంలో హైటిక్ సిటీలో పరిస్థితి దారుణంగా ఉండేది. ఎంతో ముందుచూపుతో ఆయన దాని రూపురేఖలు మార్చారు. ఆయన వేసిన బాటలో ఎంతోమంది ఉన్నత స్థానాలకు వచ్చారు. చంద్రబాబు కుటుంబానికి మేము ఎప్పుడూ సపోర్ట్ చేస్తూనే ఉంటాం. అందులో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా ఆయన్ని విడుదల చేయాలని కోరుతున్నాం" నిర్మాత కె.ఎల్.దామోదర ప్రసాద్ తెలిపారు.

"మేము సినిమా వాళ్లం ముఖానికి రంగులు వేస్తాం.. కానీ, శ్మశానానికి రంగులు వేయం. మేము సినిమా వాళ్లం శరీరానికి మేకప్ వేయిస్తాం కానీ డెడ్ బాడీకి మేకప్ చేయించం. మేము అంత నిజాయతీగా ఉంటాం. కుల మతాలకు అతీతంగా సినిమా పరిశ్రమ మొత్తం 'వి ఆర్ విత్ సీబీఎన్' అని చెప్పడం కోసమే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. కేసులకు భయపడం. ధైర్యంగా ఉంటాం. అభివృద్ధి కోసం పోరాడతాం. అభివృద్ధికే ఓటు వేస్తాం" అని తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు రవికుమార్ చౌదరి అన్నారు.

# ఉత్సవాలను జయప్రదం చేయాలి విద్యా శాఖామంత్రి



విజయనగరం: శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర లో భాగంగా ఈ నెల 29,30,31 తేదీలలో 3 రోజుల పాటు నిర్వహిస్తున్న విజయనగర ఉత్సవాలను అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించి జయప్రదం అయ్యేలా చూడాలని రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. అందుకోసం ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని, జిల్లా కలెక్టర్ అనుమతి తో వేదికల వారీగా కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియం లో బుధవారం ఉత్సవాల టీజర్ ను, కరపత్రాలను , ఆహ్వాన పత్రాలను, ఫ్లెక్స్ డిజైన్లను మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి , జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, మేయర్ విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పండగ మూడు రోజులు నగరం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ ఎస్.ఈ లక్ష్మణ రావు కు సూచించారు. పండగ కోసం బంధువులు కూడా అధికంగా వస్తారని, నీటి ఎద్దడి తలెత్తకుండా సరఫరా ప్రతి రోజు ఉండేలా చూడాలని మున్సిపల్ కమీషనర్ శ్రీ రాములు నాయుడు కు సూచించారు. సిరిమాను తిరుగుతున్నపుడు సానిటేషన్ సిబ్బంది వెనకనే వెళ్లి వెంట వెంటనే పరిశుభ్రం చేసేలా చూడాలని ఆదేశించారు. నగర వీధుల్లో కూడా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, బ్లీచింగ్ చల్లి క్లీన్ గా ఉండేలా చూడాలని అన్నారు. తాత్కాలిక టాయిలెట్లను , లైటింగ్ ను పారిశుధ్యం ను మున్సిపల్ కమీషనర్ చూడాలని అన్నారు. మూడు రోజులకు సిబ్బందిని డెప్యుటేషన్ పై నియమించాలని అన్నారు. సిరిమాను అనంతరం భక్తులు తరలి వెళ్ళడానికి అవసరమగు బస్సు లను సిద్ధంగా ఉంచాలని, ముఖ్యగా విశాఖపట్నం , శ్రీకాకుళం, పార్వతీపురం, సాలూరు రూట్లలో అదనపు బస్సు లను వేయాలని తెలిపారు. అమ్మవారి సందర్శనకు వచ్చే వి.ఐ.పి ల కవరేజ్ కోసం గుడి లోనికి కెమెరా మాన్ లందరూ వెళ్ళకుండా ఐ అండ్ పి ఆర్ ద్వారా మీడియా వారందరికి ఇన్పుట్ ను ఇవ్వాలని సూచించారు. భక్తుల రద్దీ ని దృష్టి లో పెట్టుకొని అత్యవసర మందులతో మెడికల్ క్యాంపు ను, అత్యవసర వాహనాలను ఏర్పాటు చేయాలని డి.ఎం.హెచ్ ఓ డా. భాస్కర రావు కు ఆదేశించారు.

ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఈ ఏడాది ఎక్కువగా భక్తులు వస్తారని ఊహిస్తున్నామని, మంగళవారం కేవలం బయట నుండి వచ్చే భక్తుల దర్శనం కోసం వి.ఐ.పి లంతా సోమవారం నాడే దర్శనాలు చేసుకోవాలని తెలిపారు. సిరిమాను ను సమయానికి ప్రారంభం అయ్యేలా అటవీ శాఖ, దేవాలయ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యుల సహకారం తో కార్యక్రమాలకు విస్తృత ప్రచారం గావించాలని , తన వంతు సహకారం ఉత్సవాలకు ఉంటుందని తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఆహ్వాన పత్రాలను వి.ఐ.పి లకు, జిల్లా అంతట ప్రజా ప్రతినిధులకు, ఫిలంత్రోఫిస్ట్ లకు అన్ని వర్గాల వారికీ ముందుగానే అందించాలని అన్నారు. ఈ సందర్భంగా వేదిక వారీగా ఇంచార్జ్ అధికారులను వారి ఏర్పాట్ల పై అడిగారు. వేదికలన్నీ ఒక రోజు ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు.

**13 వేదికలలో పలు వినోద కార్యక్రమాలు : కలెక్టర్**

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఉత్సవాలను 29,30,31 తేదీలలో మూడు రోజుల పాటు 13 వేదికలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవ ప్రారంభోత్సవ ర్యాలీ 29 వ తేదీన పైడితల్లి అమ్మవారి ఆలయం నుండి గురజాడ కళాభారతి వరకు సుమారు 8 వేల మంది వివిధ వర్గాల ప్రజలు, పట్టణ ప్రముఖులతో ఉదయం 8.30 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఉత్సవ ప్రారంభోత్సవ సభ గురజాడ కళాభారతి వద్ద జరుగుతుందని తెలిపారు. 29,30 తేదీలలో ఆనంద గజపతి ఆడిటోరియం లో సంగీత నృత్య ప్రదర్శనలు, కచేరీలు, లయన్స్ కమ్యూనిటీ హాల్ లో కర్రసాము, పులి వేషాలు, తప్పెటగుళ్ళు , ధింసా తదితర జానపద కళా రూపాల ప్రదర్శన ఉంటుందన్నారు. కోట లో డి.ఈ.ఓ ఆధ్వర్యం లో సైన్సు ఫేర్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శన, సంగీత కళాశాలలో పుష్ప, ఫల ప్రదర్శన ఉదయం 10 నుండి రాత్రి 9 వరకు 29,30 తేదీలలో ఉంటుందన్నారు. గురజాడ కళాభారతి లో సాంఘిక నాటికలు, ఏక పాత్రాభినయాలు, లేడీస్ రిక్రియేషన్ క్లబ్ లో కవి సమ్మేళనం, సాహిత్య గోష్టి, అష్టావధానం తదితర సాహిత్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. కోట ముందు ప్రాంతం లో 30 వ తేదీ రాత్రి, 31 న సిరిమాను ఉత్సవం అనంతరం పులివేషాల పోటీలు ఉంటాయన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడానికి రేజీవ్ క్రీడా ప్రాంగణం లో మార్షల్ ఆర్ట్స్, కరాటే, రెజ్లింగ్, కబాడీ, వాలీ బాల్, షటిల్ తదితర క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే ప్రాంగణం లో 30 న బలూన్ల ప్రదర్శన, గాలి పటాల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. అయోధ్య మైదానంలో 30 న డాగ్ షో, పెట్ షో ఉంటుందని తెలిపారు.

కోట ఎదురుగా బొంకుల దిబ్బ గ్రౌండ్స్ లో ప్రఖ్యాత సురభి నాటక ప్రదర్శనలు మాయా బజార్, భక్త ప్రహ్లాద, బాలనాగమ్మ నాటకాలు మూడు రోజుల పటు ఉంటాయన్నారు.

**సరస్ ఎక్సిబిషన్ ఈ ఏడాది ప్రత్యేకం :**

లోయర్ ట్యాంక్ బండ్ లో నున్న మన్సాస్ గ్రౌండ్ లో డ్వాక్రా చేనేత ఉత్పతుల ప్రదర్శన సరస్ ఎక్సిబిషన్ ఉంటుందని, ఈ ఎక్సిబిషన్ లో దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల నుండి 250 స్టాళ్ళ ను ఏర్పాటు చేస్తున్నామని, ఎ.పి లో 26 జిల్లాల నుండి ప్రతి జిల్లాకు 3 స్టాల్స్ చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుండి నవంబర్ 8 వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ఏడాది ఉత్సవాల్లో సరస్ ఎక్సిబిషన్ ప్రత్యేక ఆకర్షణ కానున్నదని భావిస్తున్నామన్నారు. ఈ ఎక్సిబిషన్ వద్ద ఓపెన్ డయాస్ లో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**అయోధ్యా మైదానం లో అనూప్ రూబెన్స్ మ్యూజికల్ నైట్ :**

ఈ నెల 30 వ తేదీ రాత్రి అయోధ్యా మైదానం లో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఆధ్వర్యం లో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాటు నాటు ఫేం రాహుల్ సిప్లిగంజ్ , బులెట్ బండి పాట తో పాపులర్ అయిన మోహన భోగరాజు సింగర్స్ తో పాటు జబర్దస్త్ రామ్ ప్రసాద్, బృందం కామెడీ షో ఉంటుందన్నారు. 31 వ తేదీన రాజీవ్ గాంధీ స్టేడియం లో జరిగే బాణా సంచా కార్యక్రమం తో ఉత్సవాలు ముగింపు జరుగుతాయని తెలిపారు. ప్రజలంతా ఈ ఉత్సవాలను వీక్షించి ఆనందం పొందాలని కోరుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం లో డిప్యూటీ మేయర్ లయ యాదవ్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఇంచార్జ్ ఎస్.పి అసమా ఫరీన్, డి.ఆర్.ఓ అనిత, ఉత్సవ కమిటీ సభ్యులు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి. రమేష్, అసిస్టెంట్ కమీషనర్ సుధారాణి, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ రాజ్ కుమార్, పి.డి. డి.ఆర్.డి.ఎ కళ్యాణ చక్రవర్తి , మున్సిపల్ కమీషనర్ శ్రీ రాములు నాయుడు, పలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సూర్యుడి నుండి వచ్చే ఏడుకిరణాలు-సప్త జ్ఞాన భూమికలు

**జ్ఞానం**

జ్ఞానంలో ఏడు స్థితులున్నాయి. వీటినే సప్త జ్ఞాన భూమికలు అంటాం.

(1) శుభేచ్ఛ (2) విచారణ (3) తనుమానసం (4) సత్త్వాపత్తి (5) అసంసక్తి (6) పదార్థభావని (7) తురీయం అన్నవే సప్త జ్ఞాన భూమికలు.

**1)శుభేచ్ఛ** : నాకు బ్రహ్మజ్ఞానం కావాలి అన్న ఇచ్ఛ నేను శాశ్వత దుఃఖరాహిత్య పదవి పొందాలి అన్న తీవ్ర ఆకాంక్ష.

**2)విచారణ** : బ్రహ్మజ్ఞాన ప్రాప్తి ఏ విధంగా పొందాలి? అన్న మీమాంస బ్రహ్మజ్ఞాన ప్రాప్తి విధానమే ధ్యానం, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం అని తెలుసుకోవడం.

**3)తనుమానసం** : ఇంక విచారణ ద్వారా సాధనా మార్గం తెలుసుకున్నాం గనుక, తత్ సాధనలో నిమగ్నులై ఉండడమే తనుమానసం. అంటే, ధ్యాన, స్వాధ్యాయ, సజ్జన సాంగత్యాలకు ఏ రోజూ విఘ్నం లేకుండా గడపడం. అదే తనుమానసం.

**4)సత్త్వాపత్తి** : శుద్ధసాత్త్వికం సాధించడమే సత్త్వాపత్తి, అంటే తమోగుణం, రజోగుణం అన్నవి పూర్తిగా శూన్యమైన స్థితి. ఇక మిగిలింది శుద్ధ సాత్త్వికమే. తమోగుణం అంటే సోమరితనం, రజోగుణం అంటే నాకు తెలుసు అనే అధికార దర్పం.

ఈ నాల్గవ జ్ఞానభూమిక ధ్యాన, స్వాధ్యాయ, సజ్జన సాంగత్యాల సాధన తీవ్రస్థాయి నందుకునే స్థితి ఆ తీవ్రత ద్వారా నాడీమండలం పూర్తిగా శుద్ధమైన స్థితి

మనస్సు పూర్తిగా కంట్రోలు అయిన స్థితి అదే యోగి అయిన స్థితి. అహం బ్రహ్మాస్మి అని చక్కగా సిద్ధాంతపరంగా తెలుసుకున్న స్థితి. బ్రహ్మవిదుడు అయిన స్థితి.

**5)అసంసక్తి** : దివ్యచక్షువు ఉత్తేజితమవుతున్న స్థితి. తనువు, మరి సంసారం,రెండూతాత్కాలికమైనవే అని సంపూర్ణంగా తెలుసుకున్న స్థితి. కనుక, ఈ రెంటి మీద పూర్తిగా అనాసక్తి పొందిన స్థితి అదే అసంసక్తి. దీన్నే పద్మపత్రమివాంభసా అన్నాడు కృష్ణుడు గీతలో. అయితే ఇతనికి సంసారంలో అసంసక్తి వున్నా, ధర్మ-నిష్టుడు, మరి కర్మ నిష్టుడు తనువు పట్లా, మరి సంసారం పట్లా తటస్థ దృష్టి కలిగి వున్నవాడు. దివ్యచక్షువు ఉత్తేజితమైంది కనుక, సత్యద్రష్ట కాబోతున్నాడు కనుక, పూర్తిగా దాని మీదే ఆసక్తినీ, ఏకాగ్రతనూ నిలిపినివాడు. ఇదే అసంసక్తి. ఇతనినే బ్రహ్మవిద్వరుడు అంటాం.

**6)పదార్థభావని** : అంటే దివ్య చక్షువును క్షుణ్ణంగా ఉపయోగించు కుంటున్నవాడు. ప్రతి పదం యొక్క అర్థంలో, ప్రతి వస్తువు యొక్క భావంలో ప్రత్యక్షంగా నివసిస్తున్న వాడు. అంటే బ్రహ్మవిద్వరీయుడు అయిన స్థితి. ఇదే సిద్ధస్థితి ఇదే సవికల్ప సమాధిస్థితి కూడా. అంటే ఎన్నో సమాధానాలు దొరికినా ఇంకా కొద్దిగా, సంశయాలు వున్న స్థితి.

**7)తురీయం** : ఇది మానవుని యొక్క పూర్ణవికాసస్థితి, సిద్ధుడు బుద్ధుడు అయిన స్థితి. అందరినీ యోగులుగా, సిద్ధులుగా, బుద్ధుళ్ళుగా మలచడానికి కంకణం కట్టుకొని, తత్ పరిశ్రమలో పూర్తిగా నిమగ్నమై వున్నవాళ్ళనే బుద్ధుడు అంటాం. ఇదే సహస్రదళ కమలం .ఒక్కొక్క మనిషినీ యోగిగా మలచి నప్పుడల్లా సహస్రదళకమలంలో ఒక్కొక్క రేకు విచ్చుకుంటుంది. ఇతనినే బ్రహ్మ విద్వరిష్టుడు అంటాం.తురీయం అంటే సర్వసామాన్యమైన జాగృత, స్వప్న, సుషుప్త స్థితులను దాటినవాడు. తురీయ అంటే మూడింటినీ దాటిన అని అర్థం అంటే నిర్వికల్పసమాధి స్థితి కి చేరుకున్న స్థితి. సమాధి అంటే సమాధానాలు తెలుసుకున్న స్థితి. నిర్వికల్ప సమాధి అంటే ఏ సందేహాలూ, ఏ సంశయాలూ లేని స్థితి...స్వస్తి..

# నక్కపల్లి ను కరువు మండలం గా ప్రకటించాలి



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): పాయకరావుపేట నియోజకవర్గం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎండిపోయిన వరి పైర్లు పట్టుకుని ధర్నా చేసి అనంతరం తహశీల్దార్ గారు కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కొంతమంది రైతులు తదితరులు పాల్గొన్నారు.వెంటనే రైతు లందరికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి అని డిమాండ్ చేశారు.

# ఈ ఆహార పదార్థాలు తింటే అస్సలు మతిమరుపు రాదు!



శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో ఒకటి మెదడు. బ్రెయిన్ లోని నాడీ కణాలు సరిగ్గా ఉంటేనే.. మనిషి సక్రమంగా ఉండగలడు. మెదడులో ఏ కణాలు దెబ్బతిన్నా.. బ్రెయిన్ సరిగ్గా పని చేయదు. కాబట్టి ఎప్పుడూ బ్రెయిన్ ని యాక్టీవ్ గా ఉండేలా చూసుకోవాలి. సమతుల్య ఆహారం, ఎక్సర్ సైజ్ మెదడును ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. మెదడు హెల్దీగా ఉంటే పార్కిన్సన్ వ్యాధి, చిత్త వైకల్యం, అల్జీ మర్స్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి. మనం తీసుకునే ఆహారమే బ్రెయిన్ పై ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి మనం తీసుకునే ఆహారాల్లో కొన్ని సూపర్ ఫుడ్స్ చేర్చడం వల్ల మెదడు మెమరీ పని తీరుకు సహాయ పడతాయి. మెమరీ సరిగ్గా ఉంటేనే ఏ పని మీదైనా ఏకా గ్రత అనేది పెరుగుతుంది.

**వాల్ నట్స్:** బ్రెయిన్ ని యాక్టీవ్ చేసి, మెమరీని పెంచడంలో వాల్ నట్స్ అనేవి బాగా హెల్ప్ అవుతాయి. వాల్ నట్స్ తినడం వల్ల న్యూరాన్స్, బ్రెయిన్స్ మధ్య కమ్యూనికేషన్ అభివృద్ధి చేస్తుంది. కాబట్టి మెమరీని పెంచుకోవాలంటే వాల్ నట్స్ ని మీ ఆహారంలో ఒక భాగం చేసుకోండి.

**చాక్లెట్స్:** చాక్లెట్స్ తినడం వల్ల నష్టాలే కాదు లాభాలు కూడా ఉన్నాయి. బ్రెయిన్ చురుగ్గా పని చేసేందుకు.. రక్త ప్రసరణ సరిగ్గా ఉండేందుకు మిల్క్ చాలక్లెట్ లేదా డార్క్ చాక్లెట్ హెల్ప్ అవుతాయి. బ్రెయిన్ యాక్టీవ్ గా ఉంటేనే.. ఏకాగ్రత అనేది పెరుగుతుంది.

**ఆకు కూరలు:** ఆకు కూరల్లో విటమిన్స్, మినరల్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటుంది. ఆకు కూరలు తినడం వల్ల బ్రెయిన్ పవర్ కు కావాల్సిన శక్తి అందుతుంది.

**గుడ్లు:** కోడి గుడ్లు అనేది మంచి న్యూట్రీషియన్ ఫుడ్. గుడ్డులో శరీరానికి కావాల్సిన పోషకాలు, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. బ్రెయిన్ సెల్స్ కు హెచ్చరికలనే అందజేసే పోషకాలు.. గుడ్డులో మెండుగా ఉన్నాయి. కాబట్టి ప్రతి రోజూ దీన్ని మన ఆహారంలో భాగంగా చేర్చుకుంటే బోలెడన్ని బెనిఫిట్స్ ఉంటాయి.

**అరటి పండు- యాపిల్:** యాపిల్, అరటి పండులో కూడా శక్తి వంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి అల్జీ మర్స్ రాకుండా రక్షిస్తుంది. బ్రెయిన్ పెరుగుదలకు, మెదడులోని ఫంక్షన్స్ పని చేయడంలో అరటి పండు, యాపిల్ బాగా సహాయ పడతాయి. వీటిని తరచూ తినడం వల్ల బ్రెయిన్ యాక్టీవ్ గా ఉండటమే కాకుండా.. ఆరోగ్యంగా కూడా ఉంటారు.

# లవంగాలతో డయాబెటిస్‌కు చెక్



మధుమేహం లేదా డయాబెటీస్ అనేది జన్యుపరంగా కూడా కలుగుతుంది. సాధారణంగా ఈ వ్యాధి అనారోగ్యకర జీవన శైలి మరియు చెడు ఆహారపు అలవాట్ల వల్ల కలుగుతుంది. భారతదేశంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధితో చాలా మంది బాధపడుతున్నారు.

మధుమేహం వల్ల అనేక ఇతర వ్యాధుల కూడా కలుగుతాయి. మధుమేహం వ్యాధిగ్రస్థుల్లో ఇన్సులిన్ ముఖ్య పాత్ర వహిస్తుంది. ఇన్సులిన్ అనేది ఒక హార్మోన్.. ఇది బ్లడ్ షుగర్ ని నియంత్రణలో ఉంచడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ వల్ల ఇన్సులిన్ స్రావం పై ప్రభావం పడుతుంది. కావున బ్లడ్ షుగర్ ని నియంత్రించే కొన్ని సాధారణ ఔషదాల గురించి ఇపుడు తెలుసుకుందాం..

సాధారణంగా మన ఇళ్లల్లో.. మసాలా దినుసుగా ఉపయోగించే లవంగాలు శరీరంలో బ్లడ్ షుగర్ స్థాయి నియంత్రణలో ఉంచటానికి సహాయపడతాయి. డయాబెటిస్ ఉన్న వారు రోజు అనుసరించే డైట్ లో లవంగాలను చేర్చుకోవాలి. ఈ లవంగాలను వంట రుచిని పెంచడానికి ఉపయోగిస్తారు. ఈ లవంగాలను తినడం వల్ల బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుందని మనలో కొంత మందికే తెలుసు. లవంగాలు డయాబెటిస్ రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయి. లవంగాలు యాంటీ డయాబెటిక్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇన్ని ఔషధగుణాలు కలిగి ఉన్న లవంగాలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎలా ఉపయోగపడతాయో ఇపుడు తెలుసుకుందాం.

**మధుమేహ వ్యాధిగ్రస్తులకు లవంగాల వల్ల కలిగే లాభాలు..**

వంటల్లో ఉపయోగించే లవంగాలు యాంటీ డయాబెటిక్ గుణాలు ఉంటాయి. కావున లవంగాలతో చేసిన నూనెని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ మరియు గ్లూకోస్ ప్రతిస్పందన విధానాన్ని మెరుగుపరుస్తాయి.

లవంగాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ప్లీహ గ్రంధి పనితీరును మెరుగుపరచటంలో సహాయపడతాయి. ప్లీహ గ్రంధి అనేది మన శరీరంలో ఇన్సులిన్ ని ఉత్పత్తి చేసే అతి ముఖ్యమైన భాగం. కావున బ్లడ్ షుగర్ ని నియంత్రించుకోవడానికి రోజు లవంగాలను తినడం చాలా అవసరం.

**లవంగాలను ఉపయోగించే విధానం..**

ముందుగా లవంగాలను మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. తరువాత లవంగాల పొడిని ఒక కప్పు నీటిలో వేసి సుమారు 10 నిమిషాల పాటు మరిగించాలి. మరిగేటప్పుడు అందులో అర టీస్పూన్ టీపొడి వేసి కాసేపు అలాగే ఉంచాలి. తరువాత ఆ ద్రవాన్ని వడపోసి అది చల్లబడే వరకు వేచి ఉండాలి. ఆ ద్రవాన్ని తాగాలి.. దీని వల్ల బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుంది.

# టమాటాలో పసుపు కలిపి రాస్తే.. మీ ఫేస్ క్షణాల్లో మెరుస్తుంది!



ప్రస్తుతం మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తుంది. ఈ క్రమంలో సరైన పోషకాహారం అందక చర్మం నిర్జీవంగా తయారవుతుంది. దీంతో అందవిహీనంగా కనిపిస్తున్నారు. దానికి తోడు గంటల కొద్ది కంప్యూటర్లు, లాప్ ట్యాప్స్, మొబైల్స్ ముందు కూర్చొని పని చేయడం వల్ల ఈ ప్రభావం కూడా ఫేస్ పై పడుతుంది. దీంతో ఫేస్ లో గ్లో లేకుండా ఉంటుంది. అలాగే సరైన సమయం లేకపోవడంతో బ్యూటీ పార్లర్స్ లేదా చర్మ నిపుణుల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఇలా కాకుండా ఒక్కసారి ఇంట్లో నేచురల్ రెమిడీస్ పాటించడం వల్ల క్షణాల్లోనే స్కిన్ ని మెరిపించు కోవచ్చు. ఇలా చేయడం వల్ల డబ్బు కూడా ఆదా అవుతుంది. మరి ఆ టిప్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

టమాటా, పసుపులో చర్మాన్ని కాపాడే చక్కని పోషకాలు ఉన్నాయి. బాగా పండిన టమాటాని తీసుకుని మిక్సీలో వేసి ప్యూరీలా చేసుకోండి. అందులో కొద్దిగా పసుపు వేసు కుని బాగా కలుపు కోవాలి. ఇలా తయా రైన ప్యాక్ ని ముఖా నికి రాసుకుని సున్ని తంగా మసాజ్ చేసు కోవాలి. ఇలా కాసేపు ఆ ప్యాక్ ఆరిపోయాక.. చల్లని నీటితో ముఖా న్ని క్లీన్ చేసుకోవాలి. ఆ తర్వాత మాయిశ్చరైజర్ ని అప్లై చేయండి. ఇలా చేస్తే స్కిన్ బ్రైట్ గా, షైనీగా ఉంటుంది.

అయితే కొంత మందికి టమాటా పడదు. దీంతో అలర్జీ సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి ఈ ప్యాక్ అప్లై చేసే ముందు ప్యాచ్ టెస్ట్ చేయడం చాలా మంచిది. ముందుగా ఈ ప్యాక్ ని కొద్దిగా చేతులకు వేసుకోవడం మంచిది. ఎలాంటి అలర్జీ, దురద, దద్దుర్లు లేకపోతే అప్పుడు ముఖానికి కూడా అప్లై చేసుకోవచ్చు.

ఒక చిన్న బౌల్ లోకి కొద్దిగా చక్కెర, టమాటాను రౌండ్ గా కట్ చేసి తీసుకోండి. ఇప్పుడు సగం టమాటాను తీసుకుని దానిపై చక్కెర వేసి ముఖానికి చాలా సున్నితంగా అప్లై చేయండి. ఇలా ముఖం, కాళ్లూ, చేతులు మీద స్క్రబ్ చేయండి. ఇలా చేయడం వల్ల ఫేస్ పై దుమ్ము, దూళి, డెడ్ స్కిన్ సెల్స్ పోయి.. స్కిన్ మెరుస్తుంది. ఇలా వారానికి ఒక్కసారి చేసినా స్కిన్ ఇంప్రూవ్ మెంట్ ఖచ్చితంగా ఉంటుంది. ఈ టిప్ ని ఎలాంటి వారికైనా బాగా సూట్ అవుతుంది.

# గ్లాసు పాలలో అర చెంచా నెయ్యి కలిపి తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుం



పాలు మరియు నెయ్యి యొక్క ప్రత్యేకమైన ఆరోగ్య ప్రయోజనాల గురించి మనకు బాగా తెలుసు. అయితే, మనం వాటిని కలిపి తీసుకుంటే ఏమి జరుగుతుందో మనకు తెలియదు. వీటిని కలిపితే అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండే గొప్ప ఆరోగ్య పానీయాన్ని తయారుచేస్తారు.

పాలలో ఐరన్, ప్రొటీన్, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం మరియు విటమిన్లు ఎ, డి, బి-6, ఇ మరియు కె ఉన్నాయి. పాలలో కొవ్వు పరిమాణం దాని రకాన్ని బట్టి మారుతుంది, అది ఆవు లేదా గేదె పాలు.

నెయ్యిలో కొవ్వులో కరిగే విటమిన్లు ఎ, డి, ఇ మరియు కె ఉన్నాయి. ఫిలోనా పద్ధతిని ఉపయోగించి తయారు చేసిన నెయ్యి పోషకాలను చెక్కుచెదరకుండా ఉంచుతుంది కాబట్టి ఆవు నెయ్యి చాలా ఆరోగ్యకరమైనది. నెయ్యి మంచి కొవ్వుల యొక్క అద్భుతమైన మూలంగా కూడా పిలువబడుతుంది.

**రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది**

పాలు మరియు నెయ్యి రెండూ రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడే పోషకాలను కలిగి ఉంటాయి. నెయ్యి జీర్ణాశయంలోని మలినాలను తొలగిస్తుంది, శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది మరియు సహజ భేదిమందుగా పనిచేస్తుంది.

రోగనిరోధక శక్తి ఎక్కువగా ప్రేగు ద్వారా ప్రభావితమవుతుంది. నెయ్యి మరియు పాలు రెండూ పేగులకు మేలు చేస్తాయి కాబట్టి నెయ్యి-పాలు కలయిక రోగనిరోధక శక్తికి మంచిది.

**బరువును నిర్వహిస్తుంది**

నెయ్యి మితంగా తీసుకుంటే బరువు నిర్వహణలో సహాయపడుతుంది. నెయ్యిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు ఆకలిని అరికట్టడానికి, సంతృప్తిని పెంపొందించడానికి మరియు అతిగా తినే అవకాశాన్ని తగ్గిస్తాయి.

పాలలోని ప్రొటీన్‌తో కలిపినప్పుడు, ఇది సంతృప్తికరమైన మరియు పోషకమైన పానీయంగా మారుతుంది, భోజనం మధ్య అనారోగ్యకరమైన స్నాక్స్‌లను నివారిస్తుంది.

**చర్మం మరియు జుట్టు ఆరోగ్యం**

పాలు మరియు నెయ్యి మాయిశ్చరైజింగ్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. పసుపు పాలతో నెయ్యి కలిపి సిప్ చేయడం వల్ల చర్మాన్ని హైడ్రేట్ చేయడానికి మరియు దాని మెరుపును పునరుద్ధరించడానికి సిఫార్సు చేయబడింది. శరీరం నుండి విషాన్ని తొలగించడం ద్వారా, ఈ కలయిక చర్మం దద్దుర్లు మరియు మోటిమలు చికిత్సలో సహాయపడుతుంది.

**జీర్ణ ఆరోగ్యం**

నెయ్యి దాని జీర్ణ ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో బ్యూట్రిక్ యాసిడ్ ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్.

కోలోనోసైట్లు బ్యూటిరేట్ ద్వారా ప్రేరేపించబడతాయి మరియు ఈ కణాలు మంచి గట్ సూక్ష్మజీవుల పెరుగుదలకు ఆక్సిజన్-రహిత వాతావరణాన్ని నిర్వహించడానికి సహాయపడతాయి. ఇది గట్ బ్యాక్టీరియా, గట్ సెల్స్ మరియు ఇన్ఫ్లమేషన్ యొక్క ఆరోగ్యాన్ని నిర్వహిస్తుంది.

పాలతో కలిపి తీసుకుంటే, నెయ్యి పాలలోని జీర్ణ లక్షణాలను మెరుగుపరుస్తుంది, లాక్టోస్ అసహనం లేదా పాల ఉత్పత్తులను జీర్ణం చేయడంలో ఇబ్బంది ఉన్నవారికి జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.

**ఎముకల ఆరోగ్యం**

పాలు కాల్షియం యొక్క అద్భుతమైన మూలం, బలమైన ఎముకలు మరియు దంతాలకు అవసరమైన ఖనిజం. విటమిన్ డి కలిగిన నెయ్యితో కలిపితే, కాల్షియం శోషణ పెరుగుతుంది. కాల్షియం శోషణ మరియు ఎముకల ఆరోగ్యంలో విటమిన్ డి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

నెయ్యి అనేది కీళ్ల మంటను తగ్గించడంలో సహాయపడే ఒక ప్రసిద్ధ కందెన. పాలు తింటే ఎముకలను బలపరిచే ప్రయోజనాలు కూడా అంతే అద్భుతంగా ఉంటాయి.

**ముందు జాగ్రత్త చర్యలు**

చాలా ఆరోగ్యకరమైనది మరియు పోషకమైనది అయినప్పటికీ, పాలు మరియు నెయ్యి మిశ్రమాన్ని ఉపయోగిస్తున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. మొదట, పాలు మరియు నెయ్యి రెండింటిలో లాక్టోస్ ఉన్నందున లాక్టోస్ అసహనం ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలి.

బరువును కొనసాగించాలని చూస్తున్నవారు నెయ్యి యొక్క క్యాలరీ సాంద్రతను గుర్తుంచుకోవాలి ఇది మితంగా ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, అధికంగా తీసుకోవడం బరువు పెరగడానికి దోహదం చేస్తుంది.

శాకాహారులు లేదా కొన్ని వైద్య పరిస్థితులు ఉన్నవారు వంటి నిర్దిష్ట ఆహార పరిమితులు లేదా సున్నితత్వం ఉన్న వ్యక్తులు వోట్, సోయా లేదా బాదం పాలు వంటి ప్రత్యామ్నాయాలను ప్రయత్నించవచ్చు.

**ఎంత తీసుకోవాలి?**

పాలు మరియు నెయ్యి కలయిక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, వాటిని మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. నెయ్యి కొవ్వు పదార్థాల కారణంగా క్యాలరీలను కలిగి ఉంటుంది మరియు అధిక వినియోగం బరువు పెరగడానికి దారితీస్తుంది.

నెయ్యి కోసం సిఫార్సు చేయబడిన మోతాదు సాధారణంగా రోజుకు ఒకటి నుండి రెండు టేబుల్ స్పూన్లు. మీ పాలలో నెయ్యి కలపడానికి ముందు అర టీస్పూన్ నుండి చిన్నగా ప్రారంభించండి. కొన్ని రోజుల తర్వాత క్రమంగా మోతాదు పెంచండి.

పాలు రోజువారీ తీసుకోవడం వయస్సు, లింగం మరియు ఆహారం ఆధారంగా మారుతుంది.

## చిటికెడు పసుపును గోరువెచ్చటి నీటిలో వేసి తాగితే?



పసుపు. ప్రతి కూరలోనూ ఈ పసుపు లేకుండా పూర్తి కాదు. ఆయుర్వేదంలో పసుపు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో వున్నాయి. ఈ పసుపు చేసే మేలు ఏమిటో తెలుసుకుందాము. పసుపు నీటిని తాగటం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరగువుతుంది. పసుపు నీటిలో యాంటి ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల వల్ల గ్యాస్ సమస్య తగ్గుతుంది.

కడుపులో మంట, చికాకులను తగ్గించుకోవాలంటే పసుపు నీటిని తాగుతుండాలి. కీళ్ల నొప్పులను తగ్గించుకునేందుకు పసుపు నీటిని తాగుతుంటే ప్రయోజనం వుంటుంది. పసుపు నీటిని తాగితే కాలేయ సమస్యలు క్రమంగా తగ్గుతాయి.

శరీరంలోని మలిన పదార్థాలను వదలగొట్టడంలో పసుపు బ్రహ్మాండంగా పనిచేస్తుంది. నిమ్మ, పసుపు, తేనె మిక్స్ చేసి ముఖానికి రాసుకుంటే కాంతివంతంగా వుంటుంది.

# కొవ్వు కరిగించే వాటర్ ఫాస్టింగ్, ఎలా చేయాలి?



ఈ రోజుల్లో శరీరంలో కొవ్వు పేరుకుపోయి ఇబ్బందిపడేవారి సంఖ్య పెరిగిపోతుంది. అలాంటి వారు వాటర్ ఫాస్టింగ్ చేస్తే కొవ్వు కరిగించుకోవచ్చని నిపుణులు చెపుతారు. ఐతే దాన్ని ఎలా చేయాలో తెలుసుకుందాము. వాటర్ ఫాస్టింగ్ అనేది ఒక రకమైన ఉపవాసం, దీనిలో నీరు మాత్రమే త్రాగడానికి అనుమతించబడుతుంది. ఈ రకమైన ఉపవాసంలో సదరు వ్యక్తి ఘన ఆహారానికి దూరంగా ఉండాలి. కొవ్వును కరిగించుకునేందుకు నీటి ఉపవాసం మంచి మార్గమని పరిశోధకులు నివేదించారు.

నీటి ఉపవాసం 24 నుంచి 72 గంటలు ఉంటుంది. అయితే, దీనికి ఎటువంటి కాలపరిమితిని నిర్ణయించలేదు. ఈ ఉపవాసం మధుమేహం, క్యాన్సర్, గుండె, బీపీ, నరాల సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఉపవాస స్థితిలో, ఏ ఆహారాన్ని తీసుకోని తర్వాత శరీరంలో కార్బోహైడ్రేట్ల పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. దాంతో శక్తి కోసం శరీరం ఘనీభవించిన కొవ్వును ఉపయోగిస్తుంది. దీని వల్ల కొవ్వు పూర్తిగా తగ్గిపోతుంది.

ఈ ఉపవాసం చేయడానికి ముందు ఖచ్చితంగా నిపుణుడిని సంప్రదించాలి. దీన్ని ప్రారంభించబోతున్నట్లయితే, 2 నుండి 3 రోజులు తక్కువగా తినాలి. అధ్యయనం ప్రకారం, వాటర్ ఫాస్టింగ్ సరిగ్గా చేస్తే, ప్రతిరోజూ 0.9 కిలోల బరువు తగ్గవచ్చు.

# షాంపూ చేసే ముందు ఇలా చేస్తే జుట్టు భలేగా పెరుగుతుంది!



ప్రతి ఒక్కరికి జుట్టు అందంగా, ఒత్తుగా, నల్లగా ఉండాలని కోరుకోని వారుండరు. అందుకు హెయిర్ కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటారు. అయితే జుట్టు ఊడడానికి అనేక కారణాలు ఉన్నాయి. పోషకాహారం తీసుకోకపోడం, అనారోగ్య సమస్యలు, హార్మోనల్ ఇన్ బ్యాలెన్స్, నీటి కాలుష్యం ఇలా అనేక కారణాల జుట్టు అనేది రాలిపోతూ ఉంటుంది. జుట్టు రాలిపోతూ ఉంటే మానసికంగా కూడా ఒత్తిడికి గురవుతూ ఉంటారు. దీని ఖరీదైన షాంపూలతో పాటు సెలూన్స్ కి వెళ్లి హెయిర్ కేర్ తీసుకుంటూ ఉంటారు. ఇది కూడా మంచి విషయమే అయినా.. కొన్ని రకాల టిప్స్ పాటిస్తే మాత్రం ఎక్కువ ఖర్చు పెట్టకుండా అందమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు. అలాగే హెడ్ బాత్ చేసే ముందు కొన్ని టిప్స్ పాటిస్తే.. హెయిర్ ని అందంగా మెరిసేలా చేస్తుంది.

**ఆయిల్:** తల స్నానం చేయడానికి ముందు ఎప్పుడూ నూనె రాయాలి. నూనె రాయడం వల్ల జుట్టు అనేది తేమగా ఉంటుంది. దీంతో జుట్టు పొడిబారిపోదు. అందుకే షాంపూతో తల స్నానం చేసే ముందు కొబ్బరి నూనె లేదా ఆలీవ్ ఆయిల్ తో జుట్టుకి మసాజ్ చేయండి. తర్వాత షాంపూ చేస్తే జుట్టు షైనీగా మెరుస్తుంది.

**దువ్వడం:** తల స్నానం చేసే ముందు జుట్టుని దువ్వుతూ ఉండాలి. ఎలాంటి చిక్కులు లేకుండా దువ్వితే.. హెడ్ బాత్ చేసేటప్పుడు చిక్కులు పడకుండా ఉంటాయి. సన్నగా ఉండే దువ్వెనతో కాకుండా.. కాస్త వెడల్పుగా ఉండే పండ్ల దువ్వెనతో జుట్టును బాగా దువ్వాలి. ఇలా చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.

**గోరు వెచ్చని నీరు:** తల స్నానం చేసే ముందు షాంపూని నేరుగా తలపై పెట్టకుండా ముందు గోరు వెచ్చని నీటితో లేదా చల్లని నీటితో తలను మొత్తం తడపాలి.

**షాంపూని నేరుగా వాడకండి:** చాలా మంది షాంపూని నేరుగా తలపై రాస్తారు. ఇలా కాకుండా మీరు తీసుకునే షాంపూని కొద్దిగా మగ్గులో వేసి, వాటర్ వేసి నురగలా వచ్చేలా చేయాలి. ఇలా తల స్నానం చేస్తే జుట్టు సిల్కీగా ఉండటమే కాకుండా.. పొడి బారకుండా సాఫ్ట్ గా ఉంటుంది.

**షాంపూని తక్కువగా వాడండి:** జుట్టుకి షాంపూని వాడేటప్పుడు.. మీకు సరిపోయే దాన్ని ఎంచుకోండి. ఎక్కువగా షాంపూ వేస్తే జుట్టు బలహీనమై, పొడిబారి పోతుంది. దీంతో త్వరగా జుట్టు ఊడిపోయే ప్రమాదం ఉంది. తలకు షాంపూ నురగ పోయేంత వరకూ నీటితో క్లీన్ చేయండి.

# కలబందతో వైద్యం

కలబంద మట్టలలోని జిగురు లోపలికి తీసుకోవడం వలన శరీరంలోని వేడిని తగ్గించును.

లోపలి జిగురుని నీళ్లతో శుభ్రముగా కడిగి పటికపంచదార పొడితో తినిన చలువచేయును .

సారా పటిక ని ఒక గుంట గంటె లో వేసి పొయ్యి మీద పెడితే పొంగుతుంది . చల్లారాక దానిని పొడిచేసి ఆ పొడిని కలబంద జిగురుపైన ఒత్తుగా చల్లి ఒక గుడ్డలో కట్టి దానితో దానితో కండ్లపైన అద్దుచుండిన కండ్ల ఎరుపులు , నీరు కారడం , పుసి కారడం నొప్పులు మానును .

కలబంద రసంలో పసుపు కలిపి లోపలికి తీసుకున్న స్ప్లీన్ వృద్ధి చెంది కడుపు పెద్దగా అయ్యే రోగం నివృత్తి అగును.

కలబంద రసంలో పాలు మరియు నీరు కలిపి ఇచ్చిన సెగరోగం మరియు గర్భాశయంలో పుండు నివారణ అగును.

కలబంద గుజ్జుని పసుపు తో కలిపి కట్టిన వ్రణాలు మానును.

కలబంద మట్టని కొంచం తొక్కి పసుపుతో నూరి కట్టిన పైకి కనిపించకుండా లోపల తగిలిన దెబ్బలు అనగా కవుకు దెబ్బలు నయం అగును. నొప్పి కూడా హరించును .

కలబంద వేరు రసంతో సీసముని భస్మం చేయుదురు.

# బురిడీ కొట్టించిన ద్వారకాతిరుమల ఆలయ అధికారులు



**ఏలూరు, (విశాఖ సమాచారమ్):** మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ శ్రీధర్‌ను ద్వారకాతిరుమల దేవస్థానం అధికారులు బురిడీ కొట్టించారు. రెండు రోజుల క్రితం ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా దేవస్థానంలో వైసీపీ అభిమానులకు భోజనాలు పెట్టించారు. దీని కోసం దేవస్థానం అధికారులు ఎంపీ దగ్గర రూ.3 లక్షలు వసూలు చేశారు. శేషాచల కొండపై ఏర్పాటు చేసిన భోజనాలు వివాదాస్పద మయ్యాయి. ఎంపీ శ్రీధర్ ఇచ్చిన చెక్కు ను అన్నదానం ట్రస్టు పేరున కాకుండా ఓ అధికారి పేరిట తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దేవస్థానం అన్నదానం ట్రస్టుకు ఇచ్చినట్లుగా అధికా రులు వివరణ ఇచ్చారు. దీంతో రూ. 3 లక్షలు అన్నదాన ట్రస్టుకు నష్టం వాటిల్లింది.

మంత్రి కొట్టు సత్యనారాయణకు సయితం అన్నదాన ట్రస్టుకు ఇచ్చినట్లుగా ఆలయ అధికారుల నమ్మించారు. చెక్కు చూపమని అడిగితే బ్యాంకులో వేసామని బుకాయించారు. ఇప్పటి వరకు అన్నదాన ట్రస్టుకు ఎవరు విరాళం ఇచ్చిన చెక్కును చూపుతూ వెంటనే అధికారులు రసీదు ఇస్తున్నారు. మరి ఎంపీ శ్రీధర్ భోజనాల కోసం విరాళం ఇచ్చినట్లు ఇప్పటి వరకు అన్నదానం ట్రస్ట్ తరపున రసీదు లేదు. చెక్ విషయంపై ఆలయంలో ఏ అధికారిని అడిగిన ఈవోకు తప్ప తమకు ఏమీ తెలియదని ఉద్యోగులు చెబుతున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది

# ముప్వల లక్ష్మీ సురేష్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బుధవారం 20వ వార్డు శివాజీపాలెం 157 సచివాలయం పరిధిలో గల నౌకానగర్ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్లో ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 20వ వార్డు కార్పొరేటర్ ముప్వల లక్ష్మీ సురేష్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ యొక్క జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 157 సచివాలయం పరిధిలో గల ప్రజలు వచ్చి వారి యొక్క హెల్త్ ప్రాబ్లమ్స్ చెక్ చేయించుకుంటున్నారు ఈ యొక్క కార్యక్రమానికి జోనల్ కమిషనర్, వ్యవసాయ మార్కెటింగ్ వైస్ చైర్ పర్సన్ యువతా రెడ్డి, 20వ వార్డు ఎక్స్ ఎలక్షన్ ఇంచార్జ్ ఉరుకూటి మురళి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రకాష్, సి.ఓ రత్నకుమారి, తూర్పు నియోజకవర్గం వైయస్సార్ సిపి సోషల్ మీడియా కో-కన్వీనర్ కిల్లాన రాంప్రసాద్, సచివాలయం కన్వీనర్ ప్రసాదుల హేమలత, బంధవు వెంకటేష్, దువ్వి గోవింద్ కరాటే, 20వ వార్డు ముఖ్య నాయకులు రవికిరణ్ రెడ్డి, డాక్టర్స్, సచివాలయం సెక్రెటరీస్, వాలంటరీస్, గృహ సారుదులు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు మహిళ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఆలయం ముఖ ద్వారం ప్రారంభించిన.. సర్పంచ్ ముత్యాలు దంపతులు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం పంచాయతీ పరిధిలో బంగారమ్మ ఆదిదేవత ఆలయాల ముఖద్వారం అంగరంగ వైభవంగా సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు 8 లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి నిర్మించిన ద్వారాన్ని వేద పండితుల మంత్రం చరణల మధ్య మేళ తాళాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరవాడలో ఘనంగా శ్రీ శ్రీ దుర్గాదేవి అనుపోత్సవములు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ లో శ్రీశ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రుల అనుపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యంగ్ మెన్స్ అసోసియేషన్, బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహాలను గ్రామపురవధుల్లో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు. యంగ్ మెన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చిన్నపిల్లల చిడేతల డాన్స్ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో యంగ్ మెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉపసర్పంచ్ బండారు రామారావు, పోతల అప్పలనాయుడు, గండి ఈశ్వరరావు, రొంగలి అప్పలనాయుడు, చుక్క రవి, కుంద్రపు చిన్న , పైల పైడునాయుడు, పైల హరీష్, ద్వారపూడి శ్రీనివాస్, దుద్దుపూడి వెంకటేష్, పైల సత్యనారాయణ (ఎండి), గండి అప్పారావు, గండి లోకేష్, గండి సన్యాసిరావు, గండి శ్రీనివాస్, పరవాడ జగదీశ్వరరావు, తేలు రమణాజీ, ఆర్ నారాయణ రావు, సిద్ధనాతి దేముడు, గండి సురేష్, బొడ్డు బుజ్జి, పైల జోగి నాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలకు వెళ్లిన నారా భువనేశ్వరి

దేవుడితిరుపతి: నిజాలకు ప్రతిరూపం చంద్రబాబు అయితే అబద్ధాలకు ప్రతిరూపం జగన్ అని తెలుగు మహిళా అధ్యక్షురాలు అనిత అన్నారు. నారావారిపల్లెలో అనిత మీడియాతో మాట్లాడుతూ మంత్రి రోజాపై మండిపడ్డారు. "తిరుమలకు వెళ్లిన నారా భువనేశ్వరి తిరుమలలో ఎక్కడ రాజకీయాలు మాట్లాడలేదు. తన భర్తతో, వేంకటేశ్వర స్వామితో తనకు ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. అయితే మంత్రి రోజా తిరుమలకు వెళ్లి దేవుడి ఆలయం ముందు నుంచి రాజకీయాలు మాట్లాడి రోజా తన గొయ్యి తానే తవ్వుకున్నారు. వెంకన్నతో గేమ్స్ ఆడుకుంటే భవిష్యత్తు ఉండదు. తిరుమల గాలి తగిలితేనే పవిత్రమైన చైతన్యం వస్తుంది. రోజాకు ఎందుకు అలా లేదు అంటే... ఆమెకు వసూళ్లపైన ప్రేమ. ఆమె తిరుమలకు వెళ్లిన ప్రతిసారి ముప్పై టిక్కెట్లు అమ్ముకుంటుందట. చికెన్ కొట్టువాడి నుంచి కిరాణాకొట్టు, మార్బల్ కొట్టు వరకు ఎవరిని వదలకుండా మామూళ్లు తీసుకుంటోంది. నువ్వు చేస్తున్న చిల్లర వ్యాపారంపైన సీబీఐ విచారణ చేయిద్దాం. నింద్రలో ఎర్ర మట్టిపై సీబీఐ విచారణ చేయాలి. రోజా గంజి స్టేజీ నుంచి ఇప్పుడు బెంజి కథ వరకు రాష్ట్రంలో అందరికీ తెలుసు. రోజా చేతివాటం ట్రస్టు పెట్టింది. ఆమె చేతివాటం డబ్బులను ఆ ట్రస్టులో వేస్తోంది. పవన్ కల్యాణ్, లోకేశ్ ఒక ఫ్రేమ్‌లో కన్పిస్తేనే ఇలా వణికి పోతున్నారు. వారు ఇద్దరు రంగంలోకి దిగితే వీరి పరిస్థితి ఏంటీ?." అని అనిత వ్యాఖ్యానించారు.

## నేటినుండి పైడితల్లి అమ్మవారి దర్శనానికి రూ.300 టికెట్ల విక్రయం

విజయనగరం: శ్రీ పైడితల్లి అమ్మవారి దర్శనానికి 300 రూపాయల టిక్కెట్లను గురువారం నుండి విక్రయిస్తున్నట్లు సహాయ కమీషనర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టిక్కెట్లను న్యూపూర్ణ వద్దనున్న కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచ్, ఆలయం వెనుక నున్న కెనరా బ్యాంక్ బ్రాంచ్ తో బాటు గుడి వద్ద కూడా విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 2000 టిక్కెట్లను విక్రయించడానికి సిద్ధం చేశామని, ఈ టిక్కెట్లతో అమ్మవారి తొలేల్లు, సిరిమానోత్సం జరిగే 30, 31 తేదీలలో దర్శనానికి అనుమతిస్తారని తెలిపారు.

# జగన్ మైండ్ ఎప్పుడు జైలు,కోర్టుల చుట్టే తిరుగుతోంది

విజయవాడ : ఏపీలో కరువు తాండవం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కేంద్రం ఇతర కరువు రాష్ట్రాల్లో పర్యటన చేస్తుంటే... ప్రభుత్వాలు నివేదికలు అందిస్తున్నాయన్నారు. ఇక్కడ జగన్ మాత్రం పట్టించుకోరన్నారు. రైతులు వేల రూపాయలు వెచ్చించారని.. సరైన సమయంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామకృష్ణ అన్నారు. జగన్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. గతంలో ఎప్పుడు శ్రీశైలం, సాగర్ డ్యాంలలో ఇంతటి నీటి కొరత లేదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తాగునీటి సమస్య కూడా జఠిలం అయ్యే అవకాశం ఉందన్నారు. సీఎం జగన్ మైండ్ ఎప్పుడు జైలు,కోర్టుల చుట్టే తిరుగుతోందని రామకృష్ణ విమర్శించారు.

"రాష్ట్రంలో నియంత పాలన సాగుతోంది. పుంగనూరులో టీడీపీ కార్యకర్త చొక్కా విప్పించడం,సైకిల్ కి కట్టుకున్న టీడీపీ జెండా తొలగించడం నీచాతినీచం. ఇది కేవలం టీడీపీ సమస్య కాదు. ఇది ప్రజాస్వామ్యానికే విరుద్ధం. ప్రజాస్వామ్యాన్ని పాతిపెడుతున్న జగన్ సర్కార్ పై ప్రతిఒక్కరూ పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఏపీ ఆర్థిక పరిస్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ సీతారామన్‌కు పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఫోరెన్సిక్ ఆడిట్ అనే పదాన్ని వింటున్నాం. రాష్ట్రం అప్పులకుప్పలా మారడానికి సహకారం అందించింది కేంద్రం కాదా? బీజేపీ,వైసీపీ డ్రామాలు ఆడుతోంది. వైసీపీ ప్రభుత్వం నడుస్తోంది బీజేపీ సహకారంతోనేనని టీడీపీ, జనసేన గమనించాలి" అని రామకృష్ణ అన్నారు.

# స్నేహం

భాస్కరం భారంగా నిట్టూర్పు విడిచాడు. ఒకసారి తన భార్య అయిన భానుని చూశాడు. తప్పదు ఇది జీవితం. ఇద్దరు ఇది తమ ఆఖరి మజిలీ అనుకున్నారు. కానీ ఇది ఆఖరి మజిలీ కాదు, అని తెలుసుకోవడానికి భాస్కర్ కి ఎంతో కాలం పట్టలేదు. అనారోగ్యంతో ఉన్న భార్యను తీసుకుని, బ్యాగులు సర్దుకుని కొడుకు కోడలు ఉన్న గదికి దగ్గరకు వచ్చి మేం వస్తావురా, కోడలు, మనవరాలు జాగ్రత్త అని చెప్పి మరో మాటకు అవకాశం ఇవ్వకుండా వడివడిగా భార్యను నడిపించుకుంటూ రోడ్డు పైకి వచ్చి ఆటోలో రైల్వేస్టేషనుకు చేరుకున్నాడు. విశాఖపట్నం టికెట్ తీసుకుని ట్రైన్ వచ్చేవరకు ప్లాట్ఫారం మీద వెయిట్ చేసి, భార్యను కూర్చోబెట్టి తనకు భార్యకు కావలసినవి కొని ట్రైన్ ఎక్కేరు. ఒక్కసారి మనసులో గతాన్ని తలుచుకున్నాడు భాస్కర్. ఎలా ఉండేవాళ్ళం ఎలా అయిపోయం మేం. భాస్కర్ కొడుకు కోడలు ఇద్దరు సాఫ్ట్వేర్ ఉద్యోగస్తులే. తను భార్య అమ్మ కలిసి భీమునిపట్నం లో ఇల్లు కట్టుకుని సముద్రపు ఒడ్డున ఆహ్లాద వాతావరణం లో చుట్టూ మొక్కలు, పాదులు పెంచుకుంటూ ఆనందంగా ఉండేవారు. నాన్న నన్ను చూడకుండానే పోయాడు. మేనమామ, నన్ను అమ్మని కలిసి పెంచారు. భాస్కరం చదువు పూర్తయింది. విజయ డైరీలో ఉద్యోగం. లక్కీగా భీమునిపట్నంలో ఉద్యోగం. ఒక పెద్ద ఇంటి వాసరాలో నాలుగు, అయిదు కుటుంబలు ఉండేవి. నేను మూర్తి చిన్నప్పుడు నుండి పక్క పక్కనే ఉండేవాళ్ళం. అమ్మకి మడి ఎక్కువ. నేను ఆఫీసు నుండి రాగానే, ఒరేయ్ భాస్కరం ఆఫీస్ నుండి వచ్చావా? వెంటనే వెళ్లి కాళ్ళు కడుక్కో, నేను ఆఫీసు నుండి వచ్చిన బట్టలు వరండాలో విప్పి తువ్వాలు కట్టుకుని పెరట్లో స్నానం చేసిన తర్వాత గాని భోజనం పెట్టేది కాదు. నేను వచ్చేదాకా అమ్మ కూడా భోజనం చేసేది కాదు. ఇద్దరం కలిసి భోజనాలు ముగించే వాళ్ళం. తర్వాత ఆవిడ కొంతసేపు విశ్రాంతి తీసుకునేది. నేను డ్యూటీకి వెళ్ళిపోయావాడిని. అప్పటినుండి ఇప్పటివరకు ఒక నిబద్ధతతో నన్ను పెంచి పెద్ద చేసింది. కొంతకాలానికి నాకు పెళ్లి చేశారు. అదృష్టం కొద్దీ ఆవిడ కూడా మా డిపార్ట్మెంట్ లోనే ఉద్యోగం. పెళ్లయిన కొత్తలో మా అమ్మగారు, నేను మా ఆవిడ చేతి వంట రుచి చూడాలి అనుకున్నాం. నాకు మాత్రం అమ్మ చేతి వంట రుచి మరి ఎవరికీ సాధ్యం కాదు. ఆమె కూడా కొడుకుకి కోడలికి తను వండి పెట్టి ఆనంద పడేది. కొన్నాళ్ళకి భాస్కర్కి కొడుకు పుట్టాడు. మనవడు పుట్టినందుకు భాస్కరం తల్లి నాన్నగారు పుట్టారురా భాస్కరం అని చెప్పి మురిసిపోయింది. భాస్కరం తన కొడుకుని తన తల్లి ఎలా తనను పెంచిందో అలాగే పెంచసాగేరు. ఎంత వయసు వచ్చినా భాస్కరంలో ఏ మార్పు కనబడలేదు. అమ్మ చేతి తోనే వండించి తినేవాడు. ఆ అలవాటు అలాగే ఉంది. రిటైరైనా భాస్కర్ కి అమ్మతోనే వండించుకొని అమ్మ చేతి వంట తినేవాడు. ఆ వయసులో ఆమెకు అంతకంటే కావలసింది ఏమున్నది. భార్య భర్తలు ఇద్దరూ రిటైర్ అయ్యారు. కొడుక్కి బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. రిటైర్ అయిన భాస్కర్ కి సొంత ఊళ్లోనే ఒక చిన్న ఉద్యోగం చేస్తుండేవాడు. ఇలా రోజులు గడుస్తున్నాయి. అమ్మకి తీవ్ర అస్వస్థతకు గురైంది. తన 90 ఏటా శివైక్యం చెందారు. భాస్కర్ కి తల్లి లేని లోటు స్పష్టంగా కనిపించేది. అంత వయసులో కూడా అమ్మ చేతి వంట తినే వాడు. పెద్ద దిక్కు అమ్మ పోయేసరికి చాలాకాలం మనలో కలవలేదు. కొడుక్కి మంచి సంబంధం చూసి పెళ్లి చేశారు. కోడలు కూడా సాఫ్ట్ వేర్ ఉద్యోగి. ఇద్దరూ బెంగళూరులోనే ఉద్యోగం. వారందరూ ఆనందంగా ఉండేవారు. భాస్కర్ కి అందరూ మీ కోడలు కొడుకు ఇద్దరూ ఉద్యోగస్తులే అదృష్టం అంటే నీది అని పొగిడే వారు. భాస్కర్ కూడా లోలోపల చాలా సంతోషించేవాడు. ఒక రోజున హఠాత్తుగా భార్యకు జబ్బు చేసింది. చాలా బాధపడ్డాడు. కొడుకు కోడలూ బెంగళూరు నుండి వచ్చి అమ్మకి కావాల్సిన సేవలు చేసి, మెరుగైన వైద్యం గురించి అమ్మను, నాన్నను, వారితో పాటు తీసుకువెళ్లడానికి నిర్ణయించుకున్నారు. ఇక్కడ ఉన్న ఇల్లును ఇంటి సామాన్లను అమ్మివేసి భాస్కర్ కి ఇష్టం లేకపోయినా భార్యను తీసుకుని కొడుకు కోడలు వెంట బయలుదేరడానికి సిద్ధపడ్డాడు. కానీ బంధువులు, సన్నిహితులు, వద్దని వారించినా వెళ్ళొద్దు అని బతిమాలినా వాళ్ల నిర్ణయం మారలేదు. ముఖ్యంగా తన చిన్ననాటి స్నేహితుడు ప్రాణస్నేహితుడు అయిన మూర్తి మాత్రం వద్దురా! భాస్కర్ నీవు వెళ్ళవద్దురా ! ఇక్కడే కలిసి చదువుకున్నాం, ఆటలు ఆడుకున్నాం, కలసి ప్రక్కప్రక్కనే ఇల్లు కూడా కట్టుకొని ఉన్నాం. కొడుకు కోడలు దగ్గర కొన్నాళ్ళు నీ భార్యకు వైద్యం అయిన దాకా ఉండి తిరిగిరారా, అంతే కానీ ఇక్కడ ఇల్లు, పొల్లు, సామాన్లు అమ్ముకుని వెళ్ళకు రా భాస్కర్, అని ప్రాధేయపడ్డాడు. అనుభవంతో చెబుతున్నానురా, నా మాట విని కొన్నాళ్ల పాటు అక్కడ ఉండి తిరిగి రా, అని చెప్పాడు మూర్తి. అన్నిటికీ ఆ భగవంతుడు ఉన్నాడు రా ! మూర్తి. ఒక్కగానొక్క కొడుకు రమ్మని, వాడు తల్లికి వైద్యం చేయిస్తాను. అక్కడ ఒక ప్లాటును మీ గురించి కొన్నాను. రండి రండి అని కొడుకుతో బ్రతిమాలించుకోవాలా చెప్పురా మూర్తి. వాడే కదా ! వాడి చేతుల మీదుగానే మేము వెళ్లిపోవాలని మా ఆవిడ కోరిక. అది ఎప్పుడూ ఏదీ కోరలేదు రా. ఈ ఒక్క కోరిక కోరింది రా, దాని ఇష్టప్రకారం చేద్దామని ఇలా చేస్తున్నాను అంతే రా ! సరే నీ ఇష్టం. నీకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా, మీ ప్రాణ మిత్రుడు ఇక్కడ ఒకడు ఉన్నాడు. అని మర్చిపోకు రా భాస్కర్! నీవు నన్ను విడిచి వెళ్ళి పోతుంటే నా దేహంలో ఒక భాగం లేనట్టే భాస్కర్. అని బాధపడుతూ స్నేహితుడికి స్టేషన్ దగ్గరికి వెళ్లి వాడికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేసి వాళ్ల బెర్త్ లో కూర్చున్నాక ఇక వస్తారా భాస్కర్ జాగ్రత్త ! ఫోన్లు చేస్తూ ఉండు అని చెప్తూ విడవలేక విడవలేక బయలుదేరాడు మూర్తి. భాస్కర్, భానులు స్నేహితుడికి వీడ్కోలు చెప్పి, మూర్తి, అభిమానం ప్రేమ గురించి మాట్లాడుకుని కొడుకు కోడలు గురించి ఆలోచిస్తూ ఉదయాన్నే బెంగళూరు చేరుకున్నారు. భాస్కర్ కొడుకు కోడలు స్టేషన్కు వచ్చి రా నాన్న, రా అమ్మ, రండి అత్తయ్య, మామయ్య అని నెమ్మదిగా దిగండి అని చెప్పి సామాన్లు కూలి వాడి చేతికి ఇచ్చి బయట కారులో పెట్టమని భార్యకు చెప్పి వీల్ చైర్ తీసుకొని అమ్మను అందులో కూర్చోబెట్టి నాన్నతో రండి నాన్న కారులో కూర్చోండి అని చెప్పి భార్యతో సహా అందరూ ఇంటికి చేరుకున్నారు.

ఒక నెల రోజులు అందరూ బాగానే ఉన్నారు. అమ్మకు వారం కొకసారి హాస్పిటల్కి తీసుకువెళ్లడం వైద్యం చేయించడం, ఆఫీసుకు కొడుకు కోడలు వెళుతూ వచ్చేటప్పుడు పళ్ళు, మందులు తెచ్చేవాడు. ఇంతలో కరోనా వచ్చి సాఫ్ట్వేర్ ఉద్యోగులు అందరూ ఇంటి దగ్గర పని చేసుకుంటున్నారు. కరోనా ఫలితంగా పనిమనిషి మానేసింది. దంపతులిద్దరూ 9 గంటలకు గదిలోకి వెళ్లి ఎవరి పనులు వారు చేసుకుంటూ రాత్రి ఎనిమిది గంటలకు బయటకు వస్తారు. ఇక నాకు వంటపని, ఇంటిపని, మా ఆవిడకి కావలసినవి చూసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నాను. కోడలు వీలు చూసుకుని పనులకు సహాయం చేస్తుంది. ఎప్పుడైనా మూర్తి గాని ఫోన్ చేస్తే అతి కొద్ది సమయం మాట్లాడడానికి అవకాశం ఉండేది. ఆ సమయంలో మనవరాలు పడుకుంటే కొద్దిగా మాట్లాడడానికి అవకాశం చిక్కేది. మనమరాలు ఆడుకుంటూ ఫోన్ తీసుకుని ఫోన్తో ఆట ఆడుకునేది. నాకూ మా ఆవిడకు మాట్లాడుకునే అవకాశమే తక్కువ. ఇంటిపని వంటపని తోనే సరిపోయిది. నాకూ మా ఆవిడకు పిచ్చెక్కినట్లుగా ఉండేది. ఎప్పుడు ఇక్కడ నుండి బయటపడదామా అని కారణం గురించి వెతుకుతున్నాం. ఇంతలో లాక్ డౌన్ సడలించారు. వెంటనే పెట్టే బేడా సర్దుకుని బయటపడ్డారు. ఈ ఆలోచనలకు ఇక స్వస్తి అన్నట్టుగా విశాఖపట్నం చేరుకున్నాం. స్టేషన్ లో మూర్తి రెడీగా ఉన్నాడు. ఏమిరా భాస్కర్ ఎలా ఉండేవాడివి, ఎలా అయిపోయావురా ! పద అని తన ఇంటికి తీసుకుని వెళ్ళాడు. మూర్తి వాళ్ళ ఆవిడ రండి అన్నయ్య, రండి వదిన, రండి అని వారికి తగిన మర్యాదలు చేసి, మీరు ఎంతోకాలం ఉండలేరు అని మా వారు అంటూ ఉంటే వారు చెప్పినది అక్షరాల నిజం. మీరు వెళ్ళారే మాటే గాని వారు రోజు భాస్కర్ ఎలా ఉన్నాడో, అని రోజు తలుచుకుంటూ ఉండేవారు. మీ గురించి మేడపై ఒక గది కట్టించి, వాడు ఏదో ఒక రోజు వస్తాడు కాంతం. అందుకని వాడికి ఏ లోటు రాకుండా మేడపైన ఒక గది అన్ని సదుపాయాలతో కట్టించి ఉంచాను. వాడికి మనం ఆసరాగా ఉందాం. బ్రతికినంత కాలం బ్రతకం. ఇక్కడే నాతోనే ఉంటాడు. మరి స్నేహం అంటే అంతే కదా మరి ! భోజనాలు ముగించుకుని భార్యతో భాస్కర్ మేడపైకి గదిలోకి వెళ్ళాడు. ఒరేయ్ మూర్తి నా అన్నవాళ్లు నాకు ఉన్న లేనట్టే రా ! నీవు నేను పూర్వజన్మలో అన్నదమ్ములం. నా గురించి నీవు ఇంత శ్రమ తీసుకుని గది కట్టించి ఉండడానికి ఇంత చోటు ఇచ్చావు. అందుకు నేను నా భార్య నీకు ఎంతో రుణపడి ఉన్నాము. అంటూ నిలువెల్ల కృతజ్ఞతలతో కన్నీరుతో కౌగిలించుకున్నాడు భాస్కర్ మూర్తిని. గదిలో కూర్చుని తన సామానులో నుండి పాత రేడియో ఒకటి తీసి టేబుల్ పై ఆన్ చేసి టేబుల్ పై పెట్టాడు. అందులో నుండి ఘంటసాల పాట " కూరిమి గల వారంతా కొడుకు లేనురా.... అంటూ పాట వినిపిస్తోంది. ఆ రోజు నుండి మూర్తి, భాస్కర్ సరదాగా మాట్లాడుకోవడం ఉదయం సాయంత్రం వాకింగ్ కు వెళ్లడం తోనే గడిచిపోతుంది. భాను గారికి ఎంతో ఆనందం. అందరూ తెలిసిన వాళ్ళు. అడగకుండా సహాయం చేసేవారు. తనకి ఎంతో ఆనందంగా ఉంది. భాస్కర్, భార్యతో అంటున్నాడు, ఇక్కడికి వచ్చాం. రాగానే అనిపించింది. ఇదే మనం ఉండే చోటు, అని మనం ఇద్దరం ఇక్కడ ఉండగలమా అనే కదా! నీ సందేహం ఊళ్లో వాళ్ళు అందరూ మనకు తెలుసు. అందరూ మన వాళ్ళు, మనం వారికి మనం చేయగలిగిన సహాయం చేద్దాం. నీకు తగిన సహాయము నీవు. నేను చేయవలసిన సహాయం నేను చేస్తాను. మనం ఇక్కడ ఆరోగ్యం ఆనందంగా ఉంటే మన కోడలు కొడుకు కూడా హాయిగా ఉంటారు. వారికి మనల్ని చూడాలి అనిపిస్తే వారు వచ్చి చూస్తారు. మన ఆనందం కంటే వాడికి కావలసింది ఏమున్నది చెప్పు. అంటున్న భాస్కర్ మాటలకి తల ఊపింది భార్య భాను.

# ఢిల్లీలో భాజపా అగ్రనేతలతో పవన్ భేటీ



హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల్లో జనసేనతో పొత్తుపై బుధవారం స్పష్టత వస్తుందని భాజపా కీలక నేత ఒకరు తెలిపారు. బుధవారం దిల్లీలో భాజపా అగ్రనేతలతో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సమావేశం అయ్యారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఇందులో జీహెచ్ఎంసీ సహా పలు స్థానాల్లో ఉమ్మడి అభ్యర్థులపై స్పష్టత వస్తుంది.

జనసేన నేతలు ఇప్పటికే 32 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రెండు పార్టీలు కలసి పోటీ చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని భాజపా నేతలు ఇప్పటికే వ్యక్తపరిచారు. కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు ఇటీవల పవన్‌కల్యాణ్‌ను కలసి ఉమ్మడిగా పోటీ చేసే అంశంపై చర్చించిన విషయం విదితమే.

# శర హివేగంగా శ్రీ నూకాంబిక అమ్మవారి పునర్నిర్మాణం పనులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి భక్తులకు నూకాంబిక అమ్మవారి అమ్మవారి మూలవిరాట్ దర్శనం భక్తులకు అందించాలానే తపన తో రాష్ట్ర మంత్రివర్యులు గుడివాడ అమరనాథ్ సూచనలతో నూతన ఆలయనిర్మాణం వేగవంతం చేస్తున్నట్టు దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ మరియు ధర్మకర్తలు తెలియజేసారు.ఎండోమెంట్ డిప్యూటీ ఇంజనీర్ కె. వి. సి. కృష్ణ,డిప్యూటీ స్థపతి జి. శ్రీనివాస ఆచార్య, అసిస్టెంట్ ఇంజనీర్ శివ ల పర్యవేక్షణ లో మార్కింగ్ పూర్తి చేశామని, పుట్టింగ్, బోటం కాంక్రీట్, గ్రౌండ్ లెవెల్ కాంక్రీట్ పునాదులు వారాంరోజులు లోగా పూర్తి చేసేసి అమ్మవారి గర్భాలయం, అంతరాలాయం లకు రాతి గోడలు నిలిపేందుకు సుగమం చేస్తామని తెలియజేసారు.

# శ్రీ కామాక్షి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ సత్యవతి దంపతులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి గవరపాలెం లో ఉన్న శ్రీ కామాక్షి దేవి, గౌరీ పంచాయతన దేవస్థానం లలో కామాక్షి అమ్మవారిని గౌరీ పరమేశ్వరి అమ్మవారులను అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతమ్మ డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు. దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగినది. శ్రీ గౌరీ సేవా సంఘం కార్యదర్శి బుద్ధ రమణా జి , కామాక్షి అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షులు ముత్తుర్తి గంగారావు. వైస్ చైర్మన్ శొంఠ్యాణ సతీష్, కోశాధికారి తణుకు రవి, పట్టణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు, కార్యదర్శి కొమ్మోజి రాజు, కోశాధికారి పొన్నాడ వెంకట నర్సింహ అచారి పెదబాబు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ దుర్గా మాత అనుపు మహోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పట్టణంలో వాడవాడలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాతల అనుపుమహోత్సవం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. పట్టణంలో ఏర్పాటు చేసిన శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చేసిన భారీ విగ్రహం మహిషాసుర మర్దిని, అలాగే పార్కు సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం, రామచంద్ర థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన అమ్మవార్ల విగ్రహాలతో పాటు వాళ్ల ప్రాంతాల్లో యువజన సంఘాలు ఏర్పాటు చేసిన అమ్మవారు అనుపు ఉత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారి అనుపు మహోత్సవం సందర్భంగా భారీ సాంస్కృతి కార్యక్రమాలు నేలవేశాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో మెయిన్ రోడ్డు గుండా ఊరేగింపు సాగి శారదా నదికి చేరుకున్నాయి. పెద్ద సంఖ్యలో భవానీలు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలంగాణలో ఐటీ దాడులు




**హైదరాబాద్:** ఆయనో ప్రముఖ కాంట్రాక్టర్. మైనింగ్ రంగంలోనూ ఉన్నారు. వివిధ రకాల ఇతర వ్యాపారాలూ ఉన్నాయి. తెలంగాణలో ఆయనకు సంబంధించిన వ్యాపార సంస్థలు, కార్యాలయాలపై ఇటీవల ఐటీ దాడులు జరిగాయి. ఇవి ఇక్కడికన్నా ఏపీలోని ఒక రాజకీయ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. ఆ కాంట్రాక్టర్‌కి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు పార్టీల ముఖ్య నేతలతో అత్యంత సన్నిహిత ఆర్థిక, వ్యక్తిగత సంబంధాలున్నాయి. ఎన్నికల సమయంలో వారికి అవసరమైన ఆర్థిక వనరుల్ని సమీకరించడంలో, గుట్టు చప్పుడు కాకుండా అవసరమైన చోటుకు తరలించడంలో కీలక పాత్ర పోషిస్తారని రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉంది.

ఇటీవల కర్ణాటక ఎన్నికల్లో ఆయన ద్వారా కొందరికి నిధులు అందాయని.. అవి ఇప్పుడు అటు నుంచి తెలంగాణ ఎన్నికల కోసం వచ్చే అవకాశం ఉందన్న అనుమానంతో కొంతకాలంగా నిఘా పెట్టినట్లు సమాచారం. తెలంగాణకు చెందిన ఒక పార్టీ నాయకురాలు ఏపీలో అడుగుపెట్టకుండా చక్రం తిప్పడంలోనూ ఆ కాంట్రాక్టర్ ప్రమేయం ఉందన్న ప్రచారం ఉంది. అలాంటి బడా కాంట్రాక్టర్‌కు సంబంధించిన సంస్థలపై ఇటీవల మూడు రోజులపాటు జరిగిన ఐటీ దాడులు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ముఖ్య నాయకుడిలో తీవ్ర కలవరపాటు కలిగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ నాయకుడి ఆర్థిక వనరుల్ని కూడా ఆ కాంట్రాక్టర్ కొంత పర్యవేక్షిస్తుంటారని, సదరు నేత వచ్చే ఎన్నికల కోసం కొంత నిధులు ఆయన వద్దే ఉంచారని కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలంగాణలో జరిగిన ఐటీ దాడుల్లో ఎక్కడ బయటపడుతుందోనని ఆ నాయకుడు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

# 'రాజకీయం' చక్రం తిప్పుతోంది



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలోని 'గురుద్వారా'లో 'రాజకీయం' చక్రం తిప్పుతోంది. ఇక్కడ జరుగుతున్న ఆందోళనలు...వాటి కట్టడి చర్యలు చర్చనీయాంశమయ్యాయి. అధికార పార్టీలోని పలువురు నాయకులను పెద్దలను ప్రసన్నం చేసుకోవడంతోనే 'గురుద్వారా' అధ్యక్షులుగా కొనసాగుతున్న దిల్బా సింగ్ ఆనంద్‌కు రాష్ట్ర సింగ్ కార్పొరేషన్ పదవి కట్టబెట్టారన్న విమర్శలున్నాయి. తనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన వ్యక్తం చేస్తున్నవారిపై పదవి చేతికొచ్చిన తక్షణమే ఉక్కుపాదం మోపడం.. రాజకీయ అండ ఉందన్న ఆరోపణలకు బలం చేకూర్చుతోంది.

**అడ్డుకున్న పోలీసులు:** సీతమ్మధారలోని గురుద్వారా అధ్యక్షులుగా ఉన్న దిల్బా సింగ్ ఆనంద్ అభివృద్ధి పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, వ్యయ బిల్లులు ఇష్టారాజ్యంగా చూపిస్తున్నారంటూ కొంత మంది గత నెల 26వ తేదీ నుంచి శాంతి యుత ధర్నా చేస్తున్నారు. కమిటీలోని మొత్తం సభ్యులతో చర్చించకుండా, కొంత మందితో మాట్లాడి రూ.16.50 లక్షలు ఖర్చు చేస్తున్నారని, అందులో మార్బుల్స్ తొలగించి టైల్స్ వేయడానికి తాజాగా నిర్ణయం తీసుకుంటే? ఆరు నెలల క్రితమే టైల్స్ ఎలా కొనుగోలు చేశారో చెప్పాలంటూ నిరసనకారులు కోరారు. బాగున్నప్పటికీ.. గ్రీన్ కార్పెట్, సీలింగ్, దీపాలు ఏర్పాటుకు నిధుల వ్యయంపైనా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఆలయంలోనే కూర్చొని 28 రోజులుగా నిరసన తెలియజేస్తున్న వారిపై దాడి చేసేందుకు ఏకంగా ముగ్గురు ప్రైవేటు బౌన్సర్లు, ఇతరులు పెద్దసంఖ్యలో వచ్చినట్లు ఆందోళన చేపట్టిన వర్గం ఆరోపిస్తోంది. అదే సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి శాంతియుత ధర్నా చేస్తున్న వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడం, వృద్ధులని చూడకుండా తోసేశారంటూ సతీందర్ సింగ్ సేఠీ నిరాహార దీక్షకు కూర్చొన్నారు. కేవలం రాజకీయ, ధన ప్రభావాలకు లోనై పోలీసులు ఎలాంటి కారణాలు చెప్పకుండా బయటకు నెట్టేయడాన్ని నిరసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై దిల్బా సింగ్ ఆనంద్‌ను వివరణ కోరగా... వచ్చే నవంబరులో గురునానక్ జయంతి పురస్కరించుకుని నగర కీర్తన గురుద్వారాలో జరుగుతుందని, ఆ సమయంలో సింగ్‌లతో ప్రత్యేక విందుకు సీఎం జగన్, వైకాపా సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిలను ఆహ్వానించినట్లు తెలిపారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అయితే కొందరు ఈ పనులను అడ్డుకున్నారని, అందుకే పోలీసులు జోక్యం చేసుకున్నారని తెలిపారు. ఇరువర్గాలపై బైండోవర్ పెట్టినట్లు నాల్గవ పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కొన్ని నెలల కిందట...: అధ్యక్షులు దిల్బా సింగ్ ఆనంద్ 'సత్ సంగత్ గురుద్వారా' ట్రస్టు ప్రయోజనాలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్నారని, చట్ట ప్రకారం పని చేయడం లేదంటూ సభ్యులు కొందరు ఆరోపణలకు దిగారు. పదవీ కాలం రెండేళ్లు కాగా, గత ఎనిమిదేళ్లుగా అనధికారికంగా, ఇష్టారాజ్యంగా ఆ పదవిలో కొనసాగుతున్నారని, నిబంధనల ప్రకారం ఎన్నికలు జరగని వ్యవహారంపై ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గురుద్వారా మందిరానికి ఆనుకుని జీవీఎంసీ గ్రీన్ బెల్ట్ స్థలం ఉంది. పక్కనే మందిరం ఉండటంతో ఆ స్థలాన్ని మొక్కలతో సుందరీకరణ చేసుకునేలా సత్ సంగత్ అసోసియేషన్‌కు జీవీఎంసీ అప్పగించింది. ఈ గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని దుకాణాలుగా మార్చి అద్దెలకు ఇచ్చినట్లు ట్రస్టు అధ్యక్షులపై ఈ ఏడాది మే నెలలో ఆరోపణలొచ్చాయి. జీవీఎంసీ స్థలంలో వ్యాపారం చేయడం నిజమేనని తేలడంతో దుకాణాలను జీవీఎంసీ తొలగించింది.

# ఘనంగా ఆంధ్రా మెడికల్ కళాశాల వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర వైద్యకళాశాల (ఏఎంసీ) శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని సెంచినరీ అలుమ్ని బిల్డింగ్ (క్యాబ్) ఛైర్మన్ డాక్టర్ టి.రవిరాజు వెల్లడించారు. ఈనెల 27 నుంచి 29 వరకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఉత్సవాలు జరుగుతాయన్నారు. కళాశాల వేదికగా 28న క్యాబ్ భవనం ప్రారంభోత్సవం, పైలాన్ ఆవిష్కరణ, పూర్వ విద్యార్థుల సహాయంతో నవీకరించిన సెంచినరీ బ్లాక్ ప్రారంభోత్సవాలు జరగనున్నాయని చెప్పారు.

కళాశాల ఆవరణలో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ 1923లో 32మంది వైద్య విద్యార్థులతో కళాశాల ఏర్పడిందని చెప్పారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదిగిందన్నారు. దేశంలోనే ఏడో పురాతన వైద్యకళాశాలగా గుర్తింపు పొందిందన్నారు. వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని శతాబ్ది వేడుకలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇదే సమయంలో చదువులమ్మ రుణం తీర్చుకోవడానికి ఒక కార్యక్రమం చేపట్టాలని భావించి 2017లో ఏఎంసీ ప్రిన్సిపల్‌గా డాక్టర్ టి.రాధ ఉన్న సమయంలో కార్యాచరణ రూపొందించామన్నారు. దీనికి తగ్గట్టుగా ఉత్తర అమెరికాలో స్థిరపడ్డ కళాశాల పూర్వ విద్యార్థులు రూ.30కోట్లు విరాళంగా ఇచ్చారన్నారు. దేశీయంగా ఉన్న పూర్వ విద్యార్థులు మరో రూ.20కోట్లు అందజేశారన్నారు. తమ విజ్ఞప్తి మేరకు కళాశాల ఆవరణలో 1.60ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం సీఏబీ(క్యాబ్) భవనానికి కేటాయించిందన్నారు. ఈ స్థలంలో రూ.40కోట్లతో క్యాబ్ భవనం నిర్మించామని, మరో రూ.10కోట్లు రివాల్వింగ్ ఫండ్‌గా పెట్టి నిర్వహణ చేపడతామన్నారు. ఆడిటోరియం, లెక్చర్ హాళ్లు, గ్రంథాలయాలు తదితరాలు ఇందులో ఉన్నాయన్నారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ క్యాబ్ భవనాన్ని, పైలాన్, నవీకరించిన ఆడిటోరియంలను ప్రారంభిస్తారని, పరిశోధన కేంద్రానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు 250, పీజీ సీట్లు 365కు చేరాయన్నారు. రూ.40కోట్లతో అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఈనెల 27న ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

అంకానా (ఉత్తర అమెరికాలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థుల సంఘం) మాజీ అధ్యక్షులు, కార్డియాలజిస్టు డాక్టర్ చలసాని ప్రసాద్ మాట్లాడుతూ అంకానా చాలా కాలంగా కళాశాలలో వసతులను మెరుగుపర్చేందుకు పలు విధాలుగా సహాయం అందజేస్తోందని తెలిపారు. క్యాబ్ భవన నిర్మాణానికి రూ.30కోట్ల వరకు ఇచ్చామని, భవిష్యత్తులో సహాయం కొనసాగుతుందన్నారు.

తెలుగు సాహితీ వైభవం పేరుతో ఈనెల 29న ప్రత్యేక గోష్ఠి నిర్వహిస్తున్నామని, సినీ పాటల రచయిత సుద్దాల అశోక్‌తేజ, ఇతర ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. అదేరోజు ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి ఆధ్వర్యంలో పాటల కచేరీ నిర్వహిస్తామన్నారు. కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.అశోక్‌కుమార్, విశ్రాంత డీఎంఈ ఆర్.శశిప్రభ, క్యాబ్ కోశాధికారి డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ సుధాకర్, ఎస్‌పీఎం ప్రొఫెసరు డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# ప్రజలు పోలీసు కుటుంబాలకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ



**కైలాసగిరి, (విశాఖ సమాచారమ్):** విజయ దశమి సందర్భంగా కైలాసగిరి ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏ.అర్.సిబ్బంది, అధికారులు మరియు స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు వినియోగించే ఆయుధాలకు మరియు వాహనాలకు అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దంపతులుప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు ఆయుధాగారం, మోటారు ట్రాన్సుపోర్టు విభాగాల్లో గల దుర్గామాత చిత్రపటానికి జిల్లా ఎస్పీ మరియు వారి సతీమణి డాక్టర్ శిల్ప ప్రత్యేక పూజలు చేశారు, ఎం.టీ సిబ్బంది ఎస్పీ గారి వాహనానికి కూడా పూజ చేయించినారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, దుర్గామాత ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ పూజా కార్యక్రమములో ఎస్పీ తో పాటుగా.. అదనపు ఎస్పి బి.విజయభాస్కర్, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణారావు, సతీష్ మరియు అరవింద్ కిషోర్, ఆర్ఎస్ఐలు నాయుడు, ఆదినారాయణ, ఏ.ఆర్ సిబ్బంది మరియు ఎం.టి సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.100 కోట్ల విలువైన ఆస్తి.. కుటుంబానికి తెలీకుండా విక్రయం



**ముంబయి:** డబ్బు కోసం ఓ మహిళ పెద్ద కుట్రకు తెరతీసింది. తన సొంత అన్నదమ్ములతో కలిసి ముంబయి నడిబొడ్డున ఉన్న రూ.100 కోట్ల విలువైన ఆస్తిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించింది. తీరా విషయం ఆస్తి హక్కు కలిగిన ఇతర సోదరులకు తెలియడంతో గుట్టురట్టైంది. వారి ఫిర్యాదు మేరకు అబిదా జాఫర్ ఇస్మాయిల్ (58) అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆమె కస్టడీలో ఉన్నారు.

సెంట్రల్ ముంబయిలో ఈ ఆస్తి ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతం బిజినెస్ హబ్‌గా అవతరించింది. అక్కడున్న భవనాల్లో వేర్వేరు కుటుంబాలు అద్దెకుంటున్నాయి. ఈ ఆస్తి విలువ సుమారు రూ.100 కోట్ల పైమాటే. వాస్తవంగా ఈ ఆస్తి అన్నదమ్ములైన జాఫర్ కపాడియా, లతీఫ్ కపాడియాది. వీరి మరణానంతరం వారి వారసులకు హక్కులు దఖలుపడ్డాయి. అద్దె ద్వారా వస్తున్న మొత్తం లతీఫ్ కుటుంబానికి వస్తోంది. లతీఫ్ పెద్ద కుమారుడు అజీజ్ (74) ప్రాపర్టీకి సంబంధించి నిర్వహణ, ఇతర వ్యవహారాలు చూస్తుంటాడు. లతీఫ్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు అజీజ్, రహీమ్, అమీనా, అబిదా, మాలిక్ ఉన్నారు. జాఫర్‌కు ఫర్జానా, రుక్సానా, రెహానా, అమిన్, అన్వర్, మెహజబీన్, అయాజ్ పిల్లలున్నారు.

జాఫర్ కుమారుడు అయిన అయాజ్‌కు ఇటీవల ఆస్తి అమ్మకం గురించి విషయం తెలిసింది. తమ ఉమ్మడి ఆస్తికి సంబంధించి లతీఫ్ కుటుంబం ఓ డెవలపర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఆస్తికి సంబంధించి పూర్తి హక్కులు తమకే ఉన్నట్లు పత్రాలు సృష్టించి డెవలపర్‌కు విక్రయించినట్లు తెలిసింది. తమకు తెలీకుండా గుట్టుచప్పుడు కాకుండా ఆస్తిని విక్రయించడంపై అయాజ్ పోలీసులను ఆశ్రయించాడు. సోదరులకు పవర్ ఆఫ్ అటార్నీగా ఉన్న అమినా ఆ డాక్యుమెంట్లపై సంతకం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు ప్రతిగా రూ.3.5 కోట్లు నగదు రూపంలో, కొత్త భవనంలో రెండు ఫ్లాట్లు ఇచ్చేందుకు ఆమెతో ఇతర సోదరులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అమీనా, రహీమ్, మాలిక్‌కు డబ్బులు అవసరం అవ్వడంతో ఈ కుట్రకు తెరలేపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన అబిదా ఇస్మాయిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బుచయ్యపేట గ్రామం లో దసరా సందర్భంగా స్వీట్లు పంచిన రమణ



**రోలుగుంట మండలం, (విశాఖ సమాచారమ్):** మండల పరిధిలో గల బుచ్చయ్యపేట గ్రామపంచాయతీలో ఘనంగా దసరా వేడుకలు జరుపుకున్నారు.

ఈ పండుగను పురస్కరించుకుని గ్రామానికి చెందిన వార్డ్ సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి అనిమిరెడ్డి రమణ తన సొంత ఖర్చులతో సుమారు 250 కుటుంబాలకు సుమారు 15 వేల రూపాయల వ్యయంతో స్వీట్ బాక్సు పంచిపెట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు జరుపుకునే పండగల్లో దసరా ముఖ్యమైన పండుగగా భావించడమే కాకుండా గ్రామంలో ఘనంగా నవరాత్రి వేడుకలు జరుపుకుంటారని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు అయినను అభినందించడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అందులో భాగంగానే గతంలో గ్రామ స్మశాన వాటికలో తన సొంత ఖర్చులతో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు.

ఇలాంటి మరెన్నోసేవా కార్యక్రమాలు చెయ్యాలని గ్రామస్తులు కోరారు.

# ఒక కోడి, ఒక మద్యం సీసా, వైసీపీ నేతల దసరా పంపకాలు

వైసీపీ నేతల దసరా పంపకాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నంలో వైసీపీ నాయకులు ఎన్నికలు రాక ముందే పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. దసరా పండుగను పురస్కరించుకొని బహుమతులు అందజేశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని 31, 32, 33, 34 వార్డులకు వైసీపీ అధ్యక్షునిగా పది రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన దొడ్డి బాపు ఆనంద్ తన అనచరులకు ఒక కోడి, ఒక మద్యం సీసా (క్వార్టర్) చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ కార్యాలయంలోనే నిర్వహించడం గమనార్హం. సుమారు 120 మందికి వీటిని అందించారు. అలాగే విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రస్తుతం విశాఖ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన 2024 ఎన్నికల్లో ఆ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో దసరా సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి అర కిలో స్వీట్లు (లడ్డూలు) పంపిణీ చేశారు. నియోజకవర్గంలో సుమారుగా 80 వేల ఇళ్లు ఉండగా, వార్డు వలంటీర్ల ద్వారా సోమవారమే వీటిని ఇంటింటికీ పంపిణీ చేయించారు. వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు దగ్గరుండి ఈ కార్యక్రమం పర్యవేక్షించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఎంపిక చేసిన కొంతమందికి కుక్కర్లు పంపిణీ చేశారు. ఈయన గతంలో ఎన్నడూ ఇలాంటి కార్యక్రమం చేయలేదని, ప్రతికూల వాతావరణం ఉండడంతో దానిని అధిగమించడానికి ఈ పంపిణీలు చేపట్టారని పార్టీ నాయకులు చెబుతున్నారు.

# తెనాలిలో శిశువు అమ్మకం

## ఆలస్యంగా వెలుగులోకి ఘటనవిచారణకు కలెక్టర్ ఆదేశం



**తెనాలి(కొత్తపేట):** శిశువు అమ్మకం గురించి ప్రభుత్వ వైద్యులకు తెలిస్తే.. వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దాన్ని అడ్డుకుంటారు. అందుకు విరుద్ధంగా కాన్పు చేయడం నుంచి పసిబిడ్డను అమ్మి సొమ్ము చేసుకోవడం వరకు అన్నింట్లో ఓ ప్రభుత్వ వైద్యురాలు కీలకంగా వ్యవహరించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుంటూరు జిల్లా తెనాలిలో పనిచేస్తున్న ఓ ప్రభుత్వ వైద్యురాలు, అదే పట్టణంలోని తన క్లినిక్‌లో గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తుంటారు. తనకు తెలిసిన ఓ ఆసుపత్రిలో కాన్పుచేస్తారు. ఆ క్రమంలో ఓ గర్భిణికి కాన్పు చేసి, శిశువును పిల్లలు లేని ఓ మహిళకు సుమారు రూ.10 లక్షలకు అమ్మి లబ్ధి పొందారు. ఇందుకు ఆధారాల్లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పసిబిడ్డను కొన్న మహిళే ప్రసవించినట్లు ఆసుపత్రి రికార్డుల్లో చూపారు. ఆ కాన్పు తాను కాకుండా, అదే ఆసుపత్రిలో కాన్పులు చేసే గుంటూరుకు చెందిన ప్రభుత్వవైద్యురాలు చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన ఈ శిశువు అమ్మకం గురించి పట్టణానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థకు తెలిసింది. వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. విచారణకు వచ్చిన అధికారులకు ఆసుపత్రి యాజమాన్యం జరిగినదంతా చెప్పింది. దీనంతటికీ కారకురాలు తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలని తేల్చిచెప్పారు. ఇదంతా ఆమెకు తెలిసి, తన పేరెందుకు బయటపెట్టారని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. తర్వాతి నుంచి యాజమాన్యం ఇక్కడ అలాంటిదేమీ జరగలేదని ప్రశ్నించిన వారికి చెబుతోంది. ఆ శిశువు బాపట్ల జిల్లా చుండూరు మండలంలో ఉన్నట్లు సమాచారం. స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు మేరకు శిశువు అమ్మకం ఘటనపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి శ్రావణ్‌బాబు ' చెప్పారు.

# ఆయుధ పూజ చేసిన నగర పోలీస్ కమిషనర్ డా. ఏ.రవి శంకర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆయుధ పూజ నిర్వహించిన నగర పోలీస్ కమిషనర్ డా. ఏ.రవి శంకర్, ఐ.పీ.ఎస్.

విజయానికి చిహ్నమైన విజయ దశమి ప్రతి ఒక్కరికీ అన్ని విషయాలలో విజయాలు చేకూర్చాలి- నగర సీపీ డా. ఏ.రవి శంకర్, ఐ.పీ.ఎస్.

దసరా పర్వదినం పురస్కరించుకొని నగర ఉన్నతాధికారులతో కలిసి నగర ఆయుధగారం ( బెల్ ఆఫ్ ఆర్మ్స్) నందు దుర్గామాత చిత్రపటాన్ని అలంకరించి, సిబ్బంది మరియు అధికారులు ఉపయోగించే ఆయుధాలను దుర్గామాత చిత్రపటం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం నగర పోలీసు మోటారు ట్రాన్స్ పోర్టు చెందిన వాహనాలకు, పోలీసు జిమ్ నందు, పోలీసు సెక్యూరిటీ వింగ్ నందు పూజలు నిర్వహించిన సీపీ గారు నగర ప్రజలకు, పోలీసు సిబ్బంది మరియు అధికారులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ పూజా కార్యక్రమంలో డి.సి.పి-1(ఎల్ & ఓ) శ్రీ కే.శ్రీనివాసరావు, ఐ.పీ.ఎస్., గారు, డి.సి.పి-2(ఎల్ & ఓ) కే.ఆనంద రెడ్డి గారు, డి.సి.పి(క్రైమ్స్) జి.నాగన్న, నగర ఏడిసిపి లు, ఎసిపి లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ అర్.ఐ లు, పి.ఆర్.ఓ, ఆర్.ఎస్.ఐ లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య వంతమైన సమాజమే జగనన్న ప్రభుత్వ పాలన లక్ష్యం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు ముఖ్య అతిథిగా 2వ వార్డు దెక్కతి పాలెం సచివాలయం లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.

కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లు ఏర్పాటు చేసిన వివిధ రకాలైన స్టాల్స్ లను వైద్య శిబిరాలను అవంతి గారు పర్యవేక్షించడం జరిగింది.

అనంతరం కార్యక్రమం ను ఉద్దేశించి అవంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మస్తిష్కం లో పుట్టిన రాష్ట్రంలో గడప గడప లో చంటిబిడ్డ యువత కాటికి కాలు చాటుకున్న పండు ముసలి వరుకూ ప్రతీ ఒక్కరికీ ఉచిత వైద్యం అందాలనే ఆలోచన ఓ ఉద్యమం లా సాగడమే కాకుండా, రాష్ట్రంలోని ప్రతీ పేదవాడి పాలిట ఓ వరం లా చేరువవుతుంది అని,జగనన్న ఆలోచన ఎప్పుడూ జనాహితమే అని, పేదలకు మంచి చేయడంలో తండ్రి ని మించిన తనయుడు గా పేరు సంపాదించారని, ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఆయన తలపెట్టిన ఈ జగనన్న ఆరోగ్య సురక్ష అనే శిబిరంలో సేవలు ప్రతీ ఒక్కరు వినియోగించుకునేలా బాధ్యత తో దగ్గరుండి శిబిరానికి వచ్చేలా పని చేసి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ని విజయ వంతం చేయాలని పిలుపినిస్తూ మాట్లాడారు. అనంతరం శిబిరంలో పలు వైద్య సేవలు అందిస్తున్న వైద్యలును - వైద్య సిబ్బంది ని - ఆశా వర్కర్లు ను అవంతి చేతులు మీదుగా ఘనంగా సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు - వైద్యలు - వైద్య సిబ్బంది -2వ వార్డు వైసిపి శ్రేణులు - సచివాలయం కన్వినర్ లు గృహ సారథులు - ఆశా వర్కర్లు - కార్యకర్తలు - ప్రజలు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ తిరుగు రథోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా బాలీవుడ్ నటుడు సోనూసూద్

## రథోత్సవంలో భారీ సాంస్కృతిక కార్యక్రమాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని గవరపాలెంశతకం పట్టు కనకదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తిరుగురథోత్సవానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి వచ్చిన బాలీవుడ్ నటుడు, బహుభాష చిత్రాల ప్రముఖ నటుడు, సామాజికవేత్త సోను సూద్ కు ఆలయానికి వచ్చిన సందర్భంగాఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు ఘనంగా స్వాగతం పలికి, ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అయనను ఆలయ కమిటీ వ్యవస్థాపకులు పివి రమణ కమిటీసభ్యులు ఘనంగా సత్కరించారు. తిరిగి రథోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. సుంకరమెట్ట జంక్షన్ నుండి సోనూసూద్ ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఊరేగింపులో ఆయనకు చెరుకు గడ్డలతో భారీ గజమాలలను వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సోను సూద్ రాక సందర్భంగా అనకాపల్లి పట్టణమంతా జన సముద్రాన్ని తలపించింది దారిపొడుగున ఇరువైపులా ఉన్న యువకులు కేరింతలు కొడుతూ హడావుడి చేయడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఊరేగింపులో ప్రత్యేక వాహనంపై ఆయన అభిమానులకు అభినందన చేస్తూ యువకులను మరింత ఉత్సాహపరిచారు. దసరా మహోత్సవ సందర్భంగా మహారాష్ట్ర కర్ణాటక ఒరిస్సా కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన భారీ సాంస్కృతిక కార్యక్రమాలుతో పాటు రాష్ట్రంలోని పేరుగాంచిన నేల వేషాలు ఏర్పాటు చేశారు. అంతేగాక గవరపాలెంలో భారీ ఎత్తున స్టేజ్ ప్రోగ్రాములు ఏర్పాటు చేశారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమాలను తిలకించేందుకు వచ్చారు. ఆలయ నిర్వహకులు పలు ప్రాంతాల్లో అమ్మవారి ప్రసాదు వితరణ కార్యక్రమాన్ని కూడా



చేపట్టారు.ఈ కార్యక్రమంలో. ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, శ్రీ నూకంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పాలిమేర శ్రీను, బుద్ధ సంతోష్, ఆళ్ల మధు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దిశ పోలీస్ స్టేషన్ డిఎస్పి మల్ల మహేష్, అనకాపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దాడి మోహన్ రావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# క్వాలిఫై అయిన సిటీ పోలీసు క్రికెట్ జట్టు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విడిసిఎ నిర్వహిస్తున్న ఇన్స్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్లో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి 'లీగ్ దశ'కి క్వాలిఫై అయిన సిటీ పోలీసు క్రికెట్ జట్టు. విశాఖపట్నంలో గాజువాక జింక్ గ్రౌండ్ లో నావల్ డాక్‌యార్డుతో జరిగిన మ్యాచ్ లో విశాఖపట్నం సిటీ పోలీస్ క్రికెట్ జట్టు 1 వికెట్ తేడాతో ఘన విజయం సాధించింది.

విడిసిఎ నిర్వహిస్తున్న ఇన్స్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో సిటీ పోలీస్ మరియు నావల్ డాక్‌యార్డుకు జరిగనటు వంటి మ్యాచ్ లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న సిటీ పోలీస్ జట్టు. తొలుత బ్యాటింగ్ చేసిన నావల్ డాక్‌యార్డు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగినటువంటి సిటీ పోలీస్ టీమ్ 16.6 ఓవర్లో 9 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసి విజయం సాధించారు.

Sugar Free Fitearly | నడివయస్సులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | थकावट से सत्वर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ఠ వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కంమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి

ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179

ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED ® HEALTH AND HAPPINESS

Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, ,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676